


# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No.37ACDFM5465G1Z1

భారత్ నయా చరిత్ర





సంపుటి : 14 | సంచిక : 69 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : మహేష్ యాదవ్ | 09-03-2026 | పేజీలు :12 | వెల :03/-


## 'రాష్ట్రపతి' ప్రొటోకాల్ వ్యవహారం దురదృష్టకరం-సీఎం చంద్రబాబు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని డార్జిలింగ్ పర్యటనలో అక్కడి ప్రభుత్వం ప్రొటోకాల్ కల్పించకపోవడం దురదృష్టకరమైన ఘటనగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తన పర్యటనలో ఆ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేయగా, ఈ అంశంపై ముఖ్యమంత్రి సామాజిక మధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రపతి పదవిని అవమానించేలా అక్కడి ప్రభుత్వం వ్యహరించడాన్ని తప్పుబట్టారు. ఏ ప్రభుత్వమైనా రాష్ట్రపతి పట్ల గౌరవ, మర్యాదలతో మెలగాలని, రాజ్యాంగ సంస్థలు రాజకీయాలకు అతీతంగా ఉంటాయని పేర్కొన్నారు. వాటి పవిత్రతను కాపాడుకోవడం సమిష్టి విధి అని పేర్కొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ వ్యవహారంపై స్పందిస్తూ.. ఈ సంఘటనను అత్యంత విచారకరమైనదిగా ఎక్స్‌లో పేర్కొన్నారు. దేశంలో రాష్ట్రపతి పదవి అత్యున్నత రాజ్యాంగ హోదా కలిగి ఉందని, ఆ పదవిలో అత్యున్నత గౌరవాన్ని ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. రాష్ట్రపతి పర్యటన సజావుగా సాగేలా చూడటం సంబంధిత అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు.

## చెరువుల కబ్జాను బీఆర్‌ఎస్ అడ్డుకోలేదు: సీఎం రేవంత్



మహానగరంలో చెరువుల కబ్జాకు గురవుతుంటే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అడ్డుకోలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కబ్జాలకు గురైన చెరువులను హైడ్రా కాపాడి పునరుద్ధరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం శివరాంపల్లిలోని హైడ్రా పునరుద్ధరించిన బుమ్‌రుఖ్‌ఉద్దౌలా చెరువును సీఎం రేవంత్ ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పునరుద్ధరించిన చెరువుల దగ్గర స్టాళ్లు ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తామని ప్రకటించారు.కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో చెరువులు కనుమరుగయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు కూడా చెరువులు లేకుండా చేశారంటూ బీఆర్‌ఎస్ పార్టీ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, బహదూర్‌పురా ఎమ్మెల్యే ముహమ్మద్ ముబీన్, ఎంఎల్సీ మీర్జా రహమత్ బేగ్ హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు హాజరయ్యారు.అంతకుముందు గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి హాకీ స్టేడియంలో ఎఫ్‌ఐఏ హాకీ మహిళల ప్రపంచ కప్ క్వాలిఫైయర్స్ -2026 టోర్నమెంట్‌ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తెలంగాణ ౖఎంఎల్ఏ అరెకపూడి గాంధీ తదితరులు హాజరయ్యారు.

## కేన్సర్ రహిత సమాజమే లక్ష్యం



కేన్సర్ రహిత సమాజమే లక్ష్యంగా విశాఖ బీచ్ రోడ్డులో రోహిత్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం 'పింక్ శారీ వాక్' కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరితంగా సాగింది. మహిళల్లో పెరుగుతున్న రొమ్ము కేన్సర్ పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పలువురు శిరోజాలను దానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటి, లైఫ్ ఎగైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గౌతమి తొలుత వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ కేన్సర్ పట్ల భయం కంటే అవగాహన పెంచుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మహిళలు వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేయవచ్చని అన్నారు. 'నేను స్వయంగా కేన్సర్ విజేతగా చెబుతున్నాను.

## ఏపీలో రెస్టారెంట్లపై ఐటీ దాడులు

రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రెస్టారెంట్లపై ఐటీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. రాజమండ్రి, నెల్లూరు, విశాఖపట్నం ప్రాంతాల్లోని పలు రెస్టారెంట్లలో ఐటీ సోదాలు చేపట్టారు. ట్యాక్స్ కట్టకుండా బిల్లులు ఎగ్గొడుతున్నారని ఈ రెస్టారెంట్లు, హోటళ్ల యాజమాన్యాలపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఆకస్మిక ఐటీ దాడులు జరిగాయి. ఈ క్రమంలో కంప్యూటర్ డేటాను ఐటీ అధికారులు పరిశీలిస్తున్నారు.ప్రధానంగా ఆన్‌లైన్ పేమెంట్స్, డిజిటల్ డేటాను పరిశీలిస్తున్నారు. ఇటీవల రూ.70వేల కోట్ల అమ్మకాల డిజిటల్ రికార్డులను పలు హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు తొలగించారని సమాచారం. ఈ క్రమంలో కీలక ఆధారాలని ఆదాయపన్ను శాఖ అధికారులు సేకరిస్తున్నారు. ఇటీవల నెల్లూరులోని శ్రీ



వెంగమాంబ పంజాబీ ఫ్యామిలీ దాబాపై ఐటీ అధికారులు దాడులు చేశారు.

## టీ20 ప్రపంచ కప్ 2026 –విశ్వ విజేతగా భారత్



టీ20 ప్రపంచ కప్ 2026లో టీమిండియా అద్భుతం చేసింది. వరుసగా రెండో సారి ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. ముచ్చటగా మూడు సార్లు పొట్టి ఫార్మాట్లో విశ్వవిజేతగా నిలిచిన ఏకైక జట్టుగా చరిత్ర సృష్టించింది. అచ్చిరాదన్న అహ్మదాబాద్ స్టేడియంలో సూర్యసేన.. కివీస్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. నరేంద్ర మోదీ స్టేడియంలో టీమిండియా బ్యాటర్లు, బౌలర్లు, ఫీల్డర్లు చెలరేగిన వేళ.. కివీస్ చిత్తు అయింది. 256 పరుగుల ఛేదనకు దిగిన న్యూజిలాండ్.. 159కే ఆలౌటైంది.టీమిండియా నిర్దేశించిన 256 పరుగుల ఛేదనలో కివీస్ బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేశారు. టిమ్ సీఫర్ట్(52), కెప్టెన్ శాంట్నర్(43) మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయారు. టీమిండియా బౌలర్ల ధాటికి వరుసగా పెవిలియన్ బాట పట్టారు. బుమ్రా 4, అక్షర్ పటేల్ 3, హార్దిక్ పాండ్య, వరుణ్ చక్రవర్తి, అభిషేక్ శర్మ తలొక వికెట్ పడగొట్టారు.టీమిండియా బ్యాటర్ల విధ్వంసం టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా బ్యాటర్లు విధ్వంసం సృష్టించారు. కివీస్ బౌలర్లకు చల్లటి సాయంత్రం వేళ ముచ్చెమటలు పట్టించారు. అభిషేక్ శర్మ(52), సంజు శాంసన్(89), ఇషాన్ కిషన్(54) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. ఆఖరిలో వచ్చిన దూబే(26ిి) మెరిపించాడు. బ్యాటర్ల విధ్వంసానికి టీమిండియా 5 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లలో నీషమ్ 3, రచిన్ రవీంద్ర, హెన్రీ తలొక వికెట్ పడగొట్టారు.

## మారిన ఐపీఎల్ 2026 ప్రారంభం తేదీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)2026 ప్రారంభ తేదీని మార్చుతున్నట్లు నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఈ మెగా టోర్నీని మార్చి 26న ప్రారంభించనున్నట్లు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా దీన్ని మార్చి 28వ తేదీకి మార్పు చేసినట్లు నిర్వాహకలు ప్రకటించారు. కొత్త సీజన్‌కు ముందు ఆటగాళ్లకు, ఫ్రాంచైజీలకు కాస్త సమయం ఇచ్చేందుకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 లీగ్ దశ మ్యాచులు మార్చి 28 నుండి మే 24 వరకు జరుగుతుందని, 10 నగరాల్లో మ్యాచ్‌లు జరుగుతాయని సమాచారం.

## గ్యాస్ ధర పెంపుపై జనాగ్రహం



యంత్రాంగం : గ్యాస్ ధరల పెంపుపై జనాగ్రహం వ్యక్తమైంది. రాష్ట్రంలో పలుచోట్ల ఆదివారం నిరసన తెలిపారు. పలుచోట్ల వినూత్న రీతిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య సిలిండర్‌పై రూ.115 పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## టెహ్రాన్‌ను కమ్మేసిన కారుమబ్బులు

### చమురు నిల్వలపై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు



టెహ్రాన్ : అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులు తొమ్మిదో రోజు అయిన ఆదివారం కూడా కొనసాగాయి. ఇరాన్‌కు ఆర్థిక మూలాలను దెబ్బతీసే వ్యూహంతో తొలిసారి చమురు నిల్వల గోదాములను, సరఫరా కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త దాడులు చేపట్టాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోనూ, పొరుగునున్న అల్‌బోర్జ్ ప్రావిన్సులోని చమురు నిల్వ గోదాములు, సరఫరా కంపెనీల క్షేత్రాలను ధ్వంసం చేశాయి. ఈ దాడులతో అక్కడ భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఆకాశాన్నింటేలా మంటలు ఎగిసిపడ్డాయి. నగరాన్ని మింగేసేలా దట్టమైన నల్లని మేఘాలు టెహ్రాన్ అంతటా అలుముకున్నాయి. ఈ దాడుల్లో నలుగురు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని ఇరాన్ చమురు సంస్థ వెల్లడించింది. ఈశాన్య టెహ్రాన్‌లోని అఘదసియావీఏం చమురు గోదాము, దక్షిణ ప్రాంతంలోని టెహ్రాన్ చమురుశుద్ధి క్షేత్రం, అలాగే పశ్చిమ ప్రాంతంలోని సదరన్ చమురు గోదాము, కారజ్ నగరంలోని మరో చమురు గోదాముపై ఈ దాడులు జరిగినట్లు వెల్లడించింది. ఈ దాడుల కారణంగా పెద్ద మొత్తంలో చమురు సమీప వీధుల్లోకి వదరలా ముంచెత్తిందని పేర్కొంది.

## ఇక 'స్వయం-ఎపి'

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో సిఎం చంద్రబాబు. డ్వాక్రా మహిళల ఉత్పత్తులను ఇక నుండి 'స్వయం-ఎపి' బ్రాండ్‌తో విస్తృతంగా మార్కెటింగ్ చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. అమరావతి పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

పల్లె వెలుగు
సోమవారం 09/03/2026

# కేజీబీవీ లో 6,వతరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



**దొర్నిపాడు మార్చి 8 పల్లె వెలుగు న్యూస్**

దొర్నిపాడు మండలంలోని అమ్మిరెడ్డి నగర్ గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరవ తరగతి ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కొరకు ఈనెల 12 నుండి దరఖాస్తులు చేసుకోవాలని ఎస్ఓ జయమనితెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరవ తరగతిలో 40 సీట్లు ఖాళీ ఉన్నాయని అదే విధంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చేరాలనుకున్న బాలికలు ఈ నెల 12 తేదీ నుండి ఏప్రిల్ ఒకటి వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కలదు అన్నారు మరిన్ని వివరాల కొరకు కార్యాలయంలో సంప్రదించితెలుసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి డోన్ పర్యటనకు సర్వం సిద్ధం: ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కోట్ల



**పల్లె వెలుగు -డోన్**



ముఖ్యమంత్రి పర్యటనను చారిత్రాత్మక విజయవంతం చేసేందుకు అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. రేపు డోన్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో, సభా ప్రాంగణం మరియు రూట్ మ్యాప్‌ను ఎమ్మెల్యే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమ ప్రాంగణం వద్ద నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ సిబ్బంది సేవలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా కొనియాడారు. వారి పనితీరును అభినందిస్తూ, వారికి క్లీనింగ్ కిట్లను అందజేశారు. కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పారిశుద్ధ్య పనుల్లో ఎక్కడా రాజీ పడకూడదని ఈ సందర్భంగా ఆయన సూచించారు.అన్ని శాఖల అధికారులు ఒకరికొకరు సహకరించుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సభకు భారీగా తరలివచ్చే ప్రజలకు ఎండ తగలకుండా నీడ, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలి. సీఎం కాన్వాయ్‌కు, సభకు వచ్చే వాహనాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పక్కాగా ఉండాలి. నిబంధనల ప్రకారం అతిథులందరికీ తగిన గౌరవం, వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిస్నర్ ప్రసాద్ గౌడ్, డీసీ ఎం ఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, సుదర్శన్, ప్రసాద్ రెడ్డి,తూర్పు లింగారెడ్డి,కొంగనపల్లె మధు,మహేష్ పాల్గొన్నారు.

# కొత్తూరు దేవస్థానం సన్నిధిలో తెలంగాణ రాష్ట్ర నిజామాబాద్ జూనియర్ సివిల్ న్యాయమూర్తులు

**పాణ్యం మార్చి 8 పల్లె వెలుగు :**



మండలం పరిధిలోని ఎస్ కొత్తూరు గ్రామంలో వెలసిన ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానంను తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా జూనియర్ సివిల్ జడ్జిలు హరికుమార్ వారి సతీమణి చైతన్య ఆదివారం సందర్శించారు.వీరికి ఆలయ ఈవో రామకృష్ణ అర్చకులు సురేష్ శర్మ అభిషేకములు అర్చనలు పలు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వ మండపం నందు పూలమాల,శాలువ శేష వస్త్రాలతో ఘనంగా వారిని సత్కరించి స్వామివారి ప్రసాదములు స్వామి వారి చిత్రపటాన్ని వారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్.ఆర్.బి.సి కాలనీలో భావోద్వేగభరిత వేడుకలు












**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

నంద్యాల పట్టణంలోని ఎస్.ఆర్.బి.సి కాలనీలో ఉన్న పరివర్తన లైఫ్ సెంటర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శిల్పా మహిళా సహకార సంఘం చైర్మన్ నాగినీ రవి సింగారెడ్డి హాజరై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా నాగినీ రవి సింగారెడ్డి మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలబడి వారిని స్వయం సమృద్ధిగా నిలబెట్టడం సమాజం మొత్తం బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు పోషకాహార కిట్స్‌ను అందజేశారు. చిన్నారుల ఆరోగ్యం, భవిష్యత్తు బలంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు తెలిపారు. అనంతరం పిల్లలతో కొంతసేపు సరదాగా గడిపి వారితో మమేకమయ్యారు. చిన్నారులతో మాట్లాడుతూ వారిలో ఆనందాన్ని నింపుతూ, వారికి ప్రోత్సాహం ఇచ్చారు. ఈ సందర్భంగా పిల్లల ముఖాల్లో కనిపించిన చిరునవ్వులు అక్కడి వారందరినీ భావోద్వేగానికి గురి చేశాయి. ఈ కార్యక్రమంలో పూర్ణిమ, దాల్ మిల్ అమీర్, డాక్టర్ మొహమ్మద్ రఫీ, డాక్టర్ జాస్మిన్ సుల్తానా, డాక్టర్ వైష్ణవి మరియు స్థానిక మహిళలు, సిబ్బంది మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# మహిళల సాధికారతతోనే సమాజ అభివృద్ధి – మంత్రి ఎన్ఎండి ఫరూక్

**ప్రతి రంగంలో మహిళలకు సమాన అవకాశాలే ప్రభుత్వ లక్ష్యం - మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**





మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ముందుకు రావడమే సమాజ పురోగతికి పునాది అని జిల్లా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని మునిసిపల్ టౌన్ హాలులో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో మంత్రులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ చదువు మనిషి జీవితాన్ని మార్చగల శక్తి అని పేర్కొన్నారు. విద్య లేనివాడు ప్రపంచంలో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేడని, ప్రతి కుటుంబం పిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధి ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళల చదువును ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఇంజనీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినప్పటికీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతిలో చాలా మంది మహిళలే ఉన్నారని ఆయన తెలిపారు. వివాహం అయిన తర్వాత కూడా పిల్లలను చూసుకుంటూ చదువు కొనసాగిస్తూ పరీక్షలకు హాజరవుతున్న మహిళల పట్టుదల అభినందనీయం అన్నారు. గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన డీఎస్సీ పరీక్షలను మళ్లీ నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియ ప్రారంభం కావడం వల్ల యువతకు మంచి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలకు హాజరైన అభ్యర్థుల్లో మహిళలు అధిక శాతం ఉండటం మహిళల చైతన్యాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో జనన రేటు తగ్గిపోతున్న నేపథ్యంలో మానవ వనరుల అభివృద్ధి ఎంతో కీలకమని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. యువత సంఖ్య పెరిగితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, సమతుల్య జనాభా దేశ అభివృద్ధికి అవసరమని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా వేల కోట్ల రూపాయల సహాయాన్ని అందిస్తోందని ఆయన తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను నిలబెట్టడమే కాకుండా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ఒక ముస్లిం మహిళ తన కృషితో సంవత్సరానికి దాదాపు రూ.36 లక్షల ఆదాయం సంపాదిస్తూ వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉదాహరణను మంత్రి ప్రస్తావించారు. ఇలాంటి మహిళలు సమాజానికి ప్రేరణగా నిలుస్తారని, వారిని ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఆడపిల్లల వివాహాల కోసం 'షాదీ ముబారక్' వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని మంత్రి వివరించారు. మహిళల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం నిర్మాణ రంగం సహా అనేక ఉపాధి రంగాల్లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు ఎక్కువగా పనిచేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒక ఇంటి నిర్మాణంలోనే అనేక రకాల పనులు ఉంటాయని, వాటిని నేర్చుకుంటే స్థానిక యువతకు మంచి ఆదాయం లభిస్తుందని సూచించారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల పురోగతే నిజమైన అభివృద్ధి – రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని మహిళలందరికీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించిన చారిత్రక నిర్ణయం తీసుకున్న నాయకుడు ఎన్టీఆర్ అని ఆయన గుర్తు చేశారు. మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం, తల్లికి వందనం కార్యక్రమం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల ద్వారా మహిళలకు ఉపశమనం కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే మహిళలు వ్యవసాయం, వ్యాపారం, స్వయం ఉపాధి వంటి అనేక రంగాల్లో పురుషులతో సమానంగా ముందుకు సాగుతున్నారని మంత్రి పేర్కొన్నారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదుగుతూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మహిళలు తమలోని ప్రతిభను వెలికి తీసుకుని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. అంతకుముందు మంత్రులు స్వయం సహాయక సంఘాల మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శించిన స్టాల్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి లీలావతి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ వెంకట దాసు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# శిల్పా సంస్థల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు

**మహిళల ఆనందోత్సాహాల మధ్య మహిళా దినోత్సవ వేడుకలు.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**







శిల్పా మహిళా సహకార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శిల్పా సేవా సమితి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి శిల్పా మహిళా సహకార్ చైర్మన్ నాగినీ రవి సంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళల కోసం క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళల ప్రతిభను ప్రోత్సహిస్తూ సమాజంలో వారి పాత్ర ఎంతో గొప్పదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా శిల్పా సూపర్ మార్కెట్, శిల్పా డిజిటల్ టీవీ, వైఎస్సార్ గల్లీ దవాఖాన, శిల్పా మహిళా బ్యాంక్ లో పని చేసే ఆడపడుచులకు చీరలు పంపిణీ చేశారు. శిల్పా సంస్థల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను తమ కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ వారికి ప్రోత్సాహం అందిస్తున్నారని మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు సుమారు 900 మంది పోలీస్ అధికారులు సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు





**భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ**

**కొత్త బురుజు గ్రామం పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహిస్తున్న స్పెషల్ పోలీస్ బలగాలు.**

**నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలి**

**సీసీ కెమెరాలతో మరియు డ్రోన్ కెమెరాలతో నిఘా కట్టుదిట్టం**

**విధులలో నిర్లక్ష్యం వహించరాదు**

**పల్లె వెలుగు -డోన్**

నంద్యాల జిల్లాలోని డోన్ మండలం కొత్తబురుజు గ్రామం నందు సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న సందర్భంగా సుమారు 900 మంది పోలీస్ అధికారులు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ తెలిపారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికే కొత్త బురుజు గ్రామం మరియు పరిసర ప్రాంతాలను ఇప్పటికే స్పెషల్ పార్టీ బృందాలు క్షుణ్ణంగా తనిఖీలు జరిగింది ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో పోలీస్ జాగిలాలతో మరియు బాంబు డిటెక్షన్ టీం సహాయంతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుంది. సీసీ కెమెరాలు మరియు డ్రోన్ కెమెరాలతో నిరంతరం భద్రతా పర్యవేక్షణ జరుగుతుంది. కొత్తబురుజు గ్రామంలో నిర్వహించే సభా ప్రాంగణానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాల పార్కింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. బందోబస్తుకు వచ్చిన అధికారులను సిబ్బందిని సమావేశపరిచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత నిర్వహించాలని దిశ నిర్దేశం చేయడం జరిగింది. ఎట్టి పరిస్థితులలో మీకు నియమించిన డ్యూటీ ప్రదేశాన్ని వదిలి వెళ్ళ రాదని ప్రజలు ఎక్కువగా తరలివచ్చే అవకాశం ఉన్నందున మీరు విధులు నిర్వహించు ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తతో విధులు నిర్వహించాలి. డ్రోన్ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది విధులలో నిర్లక్ష్యం వహించరాదని, మీకు అప్పగించిన విధులను నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సునీల్ షోరన్..

# డోన్ ఎమ్మెల్యే సమక్షంలో భారీ చేరికలు: టీడీపీలోకి 30 కుటుంబాలు





**పల్లె వెలుగు -డోన్**

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టీడీపీలో చేరుతున్నారని డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీ నారాయణ మూర్తి ఆధ్వర్యంలో ముఖ్యమైన రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. ప్యాపిలి మండలం రాచర్ల గ్రామం రామచంద్ర రెడ్డిల నాయకత్వంలో సుమారు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ప్రభుత్వ పనితీరుపై నమ్మకంతోనే ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. కార్యకర్తలకు అండగా..పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని, కార్యకర్తల సంక్షేమానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. రాచర్ల రామచంద్ర రెడ్డిలతో పాటు. తిరుమల్ రెడ్డి. సూర్యనారాయణ రెడ్డి వడ్డే వెంకట రాముడు పూజారి రాము బి. కంబగిరి రాముడు ఏల్. కంబగిరి రాముడు ఈడిగ శీను కె. రమణ బోయ సూర్యుడు..ఇమామ్ సాహెబ్..చాకలి మురళి.. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నారాయణ మూర్తితో పాటు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే నాయకత్వంలో డోన్ నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు ఈ సందర్భంగా ప్రకటించారు.

# పలు శుభకార్యాల్లో పాల్గొన్న ఏపీ ఎస్ ఎస్ డి సిఏల్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి

**పల్లె వెలుగు -డోన్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి ఆదివారం నంద్యాల, డోన్, బేతంచెర్ల మరియు ప్యాపిలి నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి పలు వివాహ వేడుకలు, గృహ ప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నంద్యాల పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో జరిగిన కీ.శే. కెంచె విజయ్ కుమార్తె రూపిక వివాహ వేడుకకు ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం యాతం జయచంద్రారెడ్డి గార్డెన్స్‌లో జరిగిన జోష్న - జశ్వంత్ రెడ్డిల వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. బేతంచెర్ల పట్టణంలోని చౌడేశ్వరి దేవి కళ్యాణ మండపంలో జరిగిన సూరజ్ - ప్రజ్ఞల వివాహానికి హాజరయ్యారు. అదేవిధంగా పట్టణంలోని





శివారామిరెడ్డి నూతన గృహ ప్రవేశ మహోత్సవంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. డోన్ పట్టణంలోని ఇందిరానగర్‌లో నివసించే ధర్మవరం గ్రామానికి చెందిన బోయ రోగన్న కుమార్తె వివాహ వేడుకకు చైర్మన్ హాజరయ్యారు. న్యూ మధు ఫంక్షన్ హాల్‌లో జరిగిన జగదుర్తి ప్రతాప్ రెడ్డి కుమారుడి వివాహ వేడుకలో పాల్గొన్నారు. ఎం కన్వెన్షన్ హాల్‌లో జరిగిన హరి ప్రసాద్ - హారికల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ప్యాపిలి పట్టణంలోని బి.సి. కాలనీకి చెందిన ఆదోని నీలేంద్ర కుమారుడి వివాహ వేడుకలో మన్నె సుబ్బారెడ్డి పాల్గొని నూతన వధూవరులకు అక్షింతలు వేసి దీవించారు. ఈ పర్యటనల అంతటా స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని చైర్మన్ ఘన స్వాగతం పలికారు.

# నంద్యాల మహిళా వైద్యుల ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం




**పల్లె వెలుగు నంద్యాల రూరల్.**

స్త్రీ వ్యాధులపై వైద్య సదస్సు నిర్వహించిన నంద్యాల గైనకాలాజి సొసైటీ. సీనియర్ మహిళా వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మద లకు మహిళా దినోత్సవ సత్కారం. మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత: డాక్టర్ నాగమణి,డాక్టర్ వసుధ. ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని నంద్యాల గైనకాలాజి సొసైటీ, నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం ఆధ్వర్యంలో, గైనకాలాజి సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ నాగమణి, డాక్టర్ వసుధ, కోశాధికారి డాక్టర్ సునీత ల నిర్వహణలో మధుమణి సమావేశ భవనంలో జరిగిన కార్యక్రమంలో గైనకాలాజి సొసైటీ స్త్రీ వ్యాధుల పై వైద్య సదస్సు నిర్వహించారు. సదస్సులో వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ ఇందుమతి, డాక్టర్ వసుధ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ గీత, డాక్టర్ శిల్పా, డాక్టర్ సునీత వివిధ స్త్రీ వ్యాధులపై మల్టీ మీడియా సహకారంతో ప్రసంగించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐ ఎం ఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర ఐ ఎం ఎ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు,డాక్టర్ మధుసూదన రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మహిళా సాధికారత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మహిళ లను అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ నాగమణి,డాక్టర్ వసుధ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ "గివ్ టు గైయిన్" నినాదం ప్రకారం మహిళల హక్కులు,సామాజిక న్యాయం కోసం కార్యచరణ ప్రధానం అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ మహిళా వైద్యులు డాక్టర్ నాగమణి, డాక్టర్ నర్మద లకు మహిళా దినోత్సవ సత్కారం చేశారు. నవజీవన్ బధిరుల పాఠశాల బాలికలకు రెండు కుట్టు మిషన్లు కుట్టు పని శిక్షణ కోసం మహిళా వైద్యుల తరపున ఇస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళా వైద్యులు పాల్గొన్నారు.

# చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన







**నంద్యాల ప్రతినిధి. మార్చి 08 (పల్లె వెలుగు):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్వర్గీయ జాతీయ అవార్డు గ్రహీత యం. ఆర్. గోవింద రెడ్డి మరియు స్వర్గీయ ఆర్. సి. కంభగిరి రాజు చిత్రకళలో చేసిన సేవలకు జ్ఞాపకార్థం 11 వ జిల్లా స్థాయి చిత్ర లేఖన పోటీలు పోటీలు ప్రముఖ చిత్రకారులు చిత్తులూరి రామ్ ప్రసాద్, చింతలపల్లె కోటేష్ ఆధ్వర్యంలో నంద్యాల లోని రామకృష్ణ డిగ్రీ కళాశాల లోని వివేకానంద ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుండి మద్యాహ్నం 1 గంటల ఘనంగా జరిగాయి. దాదాపు 180 మంది పైగా విద్యార్థులు పాల్గొని స్వర్గీయ "భారతరత్న" సంగీత విద్యాంసురాలు యం.ఎస్. సుబ్బలక్ష్మి చిత్రాన్ని అద్భుతంగా వేశారు. ఈ కార్యక్రమం లో చిత్ర కళ లో విశిష్ట సేవలు అందించిన సీనియర్ చిత్రకారులు సి. యం. శ్రీనువాసులు (విజయ్ ఆర్ట్ )కి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారులు చిత్తులూరి రామ్ ప్రసాద్, కోటేష్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు చిత్ర కళలో కూడా రాణించాలి. మీలో వున్నా సృజనాత్మకత వెలుగు లోకి రావాలి. ఈరోజు మహిళా దినోత్సవం సందర్భంగా భారతరత్న, సంగీత విద్యాంసు రాలు ఎం. స్. సుబ్బలక్ష్మి చిత్రాలను అద్భుతమైన రీతిలో వేశారు. పాలొగొన్న విద్యార్థులకు, విజేతలకు అభినందనలు తెలిపారు. అనంతరం వారు విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధమ బహుమతి 1 గ్రాము ప్యూర్ బంగారం యల్. విరాట్, ద్వితీయ బహుమతి 15 గ్రాముల వెండి పతకం కె. గణేష్, తృతీయ 10 గ్రాముల వెండి పతకం ఆర్. రోహిత్ సాధించారు. అలాగే స్పెషల్ జ్యూరి అవార్డు కింద ప్రత్యేక పది మందికి బహుమతులు అందుకున్న వారిలో రాగ చైత్ర, కోమలేష్, దీప్తి, అఫ్రిద్, శ్రేష్ట, షణ్మికి వాసవి, క్షీరజ రెడ్డి, దత్త నరసింహ, దుర్గ, నిత్య శ్రీ సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు ప్రభాకర్, రామిరెడ్డి రెడ్డి, ప్రముఖ చిత్ర కారులు, రంగనాధ్,వెంకటేశ్వర రాజు, రాముడు, వాసు, ధనరాజ్,సుంకన్న, ఓబులేసు,సీతారాం, తరుణ్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రియదర్శిని పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం: అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు





**పల్లె వెలుగు -ప్యాపిలి**

స్థానిక ప్రియదర్శిని పాఠశాలలో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ రసూల్ బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు.. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా: శాస్త్రీయ నృత్యాలు విద్యార్థుల అభినయం ప్రేక్షకులను ముగ్ధులను చేసింది. జానపద కళా రూపమైన కోలాటాన్ని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించారు. రైతుల కష్టాలను కళ్లకు కట్టేలా విద్యార్థులు వేసిన నాటికలు ఆలోచింపజేశాయి. చదువుతో పాటు కళలకూ ప్రాధాన్యం. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పార్థసారథి మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, ఆటపాటల్లో మరియు ఇతర సృజనాత్మక రంగాల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. ఇటువంటి వార్షికోత్సవ వేడుకలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అద్భుతమైన వేదికలని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం: విద్యార్థుల తల్లులకు ఘనవందనం. వార్షికోత్సవంతో పాటు పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఏడవ తరగతి విద్యార్థుల తల్లులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తుండటం గర్వకారణమని హెచ్ఎం పార్థసారథి కొనియాడారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా దామెర్ల జయంతి



**నంద్యాల ప్రతినిధి. మార్చి 08 (పల్లె వెలుగు)**

:ప్రసిద్ధ చిత్రకారులు దామెర్ల రామారావు 130 వ జయంతిని పురస్కరించుకొని న్యూ పెయింటింగ్ ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దామెర్ల రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ చిత్ర కారులు కోటేష్, ప్రెసిడెంట్ ధనరాజ్ మాట్లాడుతూ దామెర్ల రామారావు చిత్ర కళా వైతాళికుడని చిత్ర కళలో ఆయన సైలి చాలా అద్భుతంగా ఉంటుందని ఆయన ఎన్నో వేల స్కెచ్ లు,కాన్వాస్ పై దేవత మూర్తుల చిత్రాలు, పల్లె జీవన సైలి చిత్రాలు ఎంతో రమణీయంగా వుంటాయని, రాజమండ్రి లో ఆయన పేరిట ఆర్ట్ గ్యాలరీ ఉందని తెలిపారు. ఆ మహనీయుని తలచుకుంటూ ఆయన జయంతికి నివాళు లు అర్పించామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ చిత్ర కారులు రాముడు, వాసు, శ్రీను (విజయ్ ఆర్ట్ )వైస్ ప్రెసిడెంట్ నరసింహ, సెక్రటరీ రాజా రామ్, (సుంకన్న )జాయింట్ సెక్రటరీ సీతారాం, ట్రెజరర్ తరుణ్, ఓబులేసు, ఆనంద్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 9వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**అర్జీలులో నమోదు చేసుకోవచ్చు.**

**సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100.**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**



ఈ నెల 09వ తేదీన (సోమవారం) నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా, ఆన్లైన్‌లో ఎవవనెశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ ద్వారా కూడా సమర్పించవచ్చన్నారు.
అర్జీ పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి వెబ్‌సైట్‌లోనూ లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని ఆమె చెప్పారు. అర్జీదారులు మొదట తమ మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలు మాత్రమే జిల్లా కేంద్రంలోని వేదికకు రావలసిందిగా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె ఆదేశించారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు







**నంద్యాల ప్రతినిధి. మార్చి 08 (పల్లె వెలుగు):**
ప్రజా రోడ్డు రవాణా సంస్థ నంద్యాల జిల్లా కి సంబంధించి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నంద్యాల డిపో నందు నిర్వహించారు. ఈ వేడుకలు డిపిటిఓ నంద్యాల రజియా సుల్తానా ఆధ్వర్యంలో డిపో మేనేజర్ మాధవీలత సహకారంతో నిర్వహించడం జరుగుతుంది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ లక్ష్మీ సౌజన్య గైనకాలజిస్ట్ , అడ్వకేట్ తోట నిర్మల , డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీసర్ లక్ష్మీ దేవిని ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమముకి నంద్యాల జిల్లా లోని అన్ని డిపోల నుండి మహిళా ఉద్యోగస్తులు అందరు హాజరవటమైనది. వీరిలో జిల్లా మొత్తం సంబంధించి ఐదు మంది ఉత్తమ మహిళా ఉద్యోగస్తులను ఎన్నిక చేసి వారికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరిగింది.

# 15న కర్నూలులో గిరిజనుల ముఖ్య నేతల సమావేశం

**ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చెరిస్తే ఒప్పుకోం. శ్రీశైలం పుణ్యక్షేత్రంలో బంజారాలకు సత్రం ఏర్పాటుపై రౌండ్ టేబుల్ సమావేశం. సంఘాలకు అతీతంగా రాజకీయ రిజర్వేషన్ కోసం ఉద్యమిద్దాం. ముఖ్య అతిథులుగా హాజరవుతున్న ఐపీఎస్ అధికారి లక్ష్మణ్ నాయక్ , రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్.**

**పల్లె వెలుగు శ్రీశైలం.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కె. రాజు నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో బంజారాలకు సత్రం ఏర్పాటు చేయుట కొరకు మేధావులతో, సంఘాలకు అతీతంగా, వివిధ సంఘాల నుంచి ప్రతి సంఘ నాయకుడు కర్నూలు నగరంలో వెంకయ్య పల్లి ఎల్లమ్మ ఆవరణంలో ఉన్న కళ్యాణమండపంలో ముఖ్య నేతల ఆత్మీయ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ఆదివారం నంద్యాల జిపిఎస్ కార్యాలయంలో రాజు నాయక్ మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, భవిష్యత్తు, జీవనాధారాలతో ఎలాంటి రాజీ లేకుండా ప్రభుత్వం వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. ఓట్ల సమయానికి మాత్రమే గిరిజనులు గుర్తొచ్చి, వారి సమస్యలపై మాత్రం అసెంబ్లీలో మాట్లాడే నాయకులు కనిపించకపోవడం దురదృష్టకరమని అన్నారు. శాసనసభలో ఉన్న గిరిజన ఎమ్మెల్యేలు ఈ అంశంపై స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం పట్ల గిరిజన సమాజంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. 2017 సంవత్సరం నుండి గిరిజనుల హక్కులపై పలు ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నట్లు కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో వాల్మీకి సమాజానికి చెందిన అనేక మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మంత్రులుగా పనిచేస్తున్నారని, ఒక కర్నూలు జిల్లా ఎమ్మెల్యేలు ఎంపీ మాత్రమే అసెంబ్లీ పార్లమెంట్లో ప్రస్తావించడం మన జాతికి బాధాకరం అన్నారు. అందుకు మన హక్కులను కాలరాస్తున్న పాలక ప్రభుత్వాలపై ముఖ్య నాయకుల అభిప్రాయ కార్యచరణ దిశా నిర్దేశం చేసుకోవడానికి ఈ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో వారు కీలక పదవుల్లో ఉన్నారని తెలిపారు. అయితే గిరిజనుల సమస్యలపై బలంగా మాట్లాడే నాయకులు లేకపోవడం బాధాకరమని అన్నారు. గిరిజనుల



జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో గిరిజనులకు కనీసం 10 శాతం రిజర్వేషన్ పెంచాలని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నేటికీ అనేక గిరిజన కుటుంబాలు కూడు లేక గూడు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, వారి అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కావున ప్రతి ఒక్క సంఘ నాయకులు, మేధావులు, రాజకీయాలకు, పార్టీలకు, సంఘాలకు అతీతంగా ఈ ముఖ్య నేతల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని జయప్రదం చేయాలని రాజు నాయక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రవీంద్ర నాయక్, బాల నాయక్, పుల్లన్న నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# సమాజం అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

**-ఏరియా వైద్యశాల పర్యవేక్షకులు సతీమణి షేక్ సల్మా ఆదం,గైనకాలజిస్ట్ డాక్టర్ జయమ్మ**

**గిద్దలూరు,మార్చి 8 . పల్లె వెలుగు:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గిద్దలూరు పట్టణంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గర్ల్స్ హైస్కూల్ లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాల పర్యవేక్షకులు సతీమణి షేక్ సల్మా ఆదం,గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాల గైనకాలజిస్ట్ డాక్టర్ జయమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. కుటుంబ నిర్మాణం నుండి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు కీలక బాధ్యతలు నిర్వహిస్తూ సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.మహిళలకు సమాన హక్కులు,గౌరవం మరియు అవకాశాలు కల్పించేందుకు కేంద్రంలో,రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని వారు వివరించారు.మహిళల ఆర్థిక స్వావలంబన,విద్యా అభివృద్ధి మరియు భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.మహిళలు విద్య, ఉపాధి,రాజకీయ రంగాల్లో ముందుకు వచ్చి సమాజ అభివృద్ధికి మరింతగా తోడ్పడాలని వారు పిలుపునిచ్చారు.మహిళల శక్తి దేశ అభివృద్ధికి ప్రధాన బలమని,మహిళల సాధికారతే దేశ



పురోగతికి మార్గమని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు మహిళా ఉపాధ్యాయులు,స్థానిక ప్రజాప్రతినిధులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉచిత కంటి మరియు గుండె వైద్య చికిత్స శిబిరానికి అపూర్వ స్పందన

**గడివేముల పల్లెవెలుగు దినపత్రిక**

నంద్యాల జిల్లా గడిదేముల మండలంలో పంచముఖి ఆంజనేయస్వామి గుడి దగ్గర నిర్వహించిన వైద్య శిబిరానికి కర్నూల్ వారి శ్రీ చక్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో గడివేముల భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి మరియు గుండె జబ్బుల చికిత్స శిబిరానికి అపూర్వస్పందన లభించినది . కర్నూలు శ్రీ చక్ర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ షఫీ, పారామెడికల్ స్టాఫ్ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుండి వచ్చిన రోగులకు గుండె పరీక్షలు, కంటి పరీక్షలు మరియు ఇతర పరీక్షలు ఉచితంగా వైద్యం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చక్ర మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ



కర్నూలు నగరంలో 25 సంవత్సరాల పైగా శ్రీ చక్ర హాస్పిటల్ నిరుపేదలకు తమ సేవలో అందిస్తుందని, ఆరోగ్యశ్రీ, ఈ హెచ్ ఎస్, ఏపీఎస్పీడీసీఎల్, 30కు పైగా ఇన్సూరెన్స్ కంపెనీలతో భాగస్వామ్యంగా ఉంటూ క్యాష్ లెస్ సేవలు అందిస్తున్నామన్నారు, ఆర్థో, కార్డియాలజీ, ఆప్తమాలజీ ,జనరల్ సర్జరీ ,గైనకాలజీ ,జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్,



యూరాలజీ, నెఫ్రాలజీ, డయాలసిస్ మరియు ఎమర్జెన్సీ మెడికల్ విభాగాలలో ప్రత్యేక వైద్య బృందంతో సేవలందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి విజయవంతం చేయడానికి సహకరించిన భారత్ గ్యాస్ అధినేత కె.కిరణ్ కుమార్ కు శ్రీరామ థియేటర్ ఎండి తులసి రెడ్డి,మరియు మండల గ్రామాల్లోని ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సెలవు రోజు ఇంటి పన్ను వసూళ్లు

**బండి ఆత్మకూరు పల్లె వెలుగు మార్చి 8 :**

ఉన్నతాధికారులు ఒక లక్ష్యం అంటూ నిర్దేశించాక లక్ష్యాన్ని చేరుకునే వరకు శ్రమించాల్సిందే. ఆదివారం నాడు ఓ పంచాయతీ కార్యదర్శి సెలవు దినం నాడు కూడా పన్ను వసూళ్లకు పూనుకున్నారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఈర్లపాడు గ్రామంలో దాదాపు లక్ష 16 వేల రూపాయలు ఇంటి పన్నుకు సంబంధించి లక్ష్యం ఉంది. ఇప్పటికే 70 శాతం పన్ను వసూలు అయినప్పటికీ మార్చి 15 నాటికి వంద శాతం పన్ను వసూలు చేసి తీరాల్సిందేనంటూ అధికారులు ఆంక్షలు విధించారు. ఆంక్షలు విధించాక తప్పుతుందా అంటూ కార్యదర్శి పన్నువసూళ్ల లో



పడి మునిగి తేలుతున్నారు. పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి శ్రీకాంత్ ఈర్నపాడు గ్రామానికి రెగ్యులర్ కార్యదర్శి కాదు. సోమ యాజుల పల్లె పంచాయతీ కార్యదర్శిగా ఉన్న శ్రీకాంత్ ను ఈర్నపాడు గ్రామ పంచాయతీకి ఇంచార్జి కార్యదర్శిగా నాలుగు నెలల క్రితం అధికారులు అదనపు బాధ్యతలను అప్పగించారు. రెగ్యులర్ పంచాయతీలో ఇంటి పన్నుల వసూళ్లు, బిపిఎల్ సర్వేలతోపాటు, ఇన్చార్జి గ్రామంలో కూడా పన్ను వసూళ్ల లో పడి తల మునకలు అవుతూ ఉన్నారు. తనను ఇన్చార్జి నుండి తప్పించండి మహాప్రభో! అని అధికారులకు వేడుకుంటున్నప్పటికీ కని కరించడం లేదు. ఏదో సర్దుకుపోవాలి అంటూ అధికారులు ఉచిత సలహా మాత్రం పడేస్తున్నారు.

# కార్పొరేషన్‌లో మహిళ ఉద్యోగులకు సమాన అవకాశాలు









**తొలిసారి ఆర్వో, శానిటేషన్ ఇంస్పెక్టర్లుగా అవకాశం**

**ప్రశంసా కార్యక్రమాల్లో సైతం ప్రాధాన్యం**

**కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :**

నగరపాలక సంస్థలో మహిళలు అన్నింట్లో రాణించాలనే ఉద్దేశంతో మహిళా ఉద్యోగులపై ప్రత్యేక శ్రద్ధతో సమాన అవకాశాలు కల్పిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం ఖానా ఖజానా వద్ద ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలచే కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులను సత్కరించారు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి, షబానా, సచివాలయ విభాగంలో ఉమెన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కావ్య, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఎంజల్, పార్కుల విభాగంలో తెలుగు రుక్మిణి, పారిశుద్ధ్య కార్మిక విభాగంలో నాగేంద్రమ్మ, వెంకటేశ్వరమ్మల సేవలను కమిషనర్ ప్రశంసించి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో మొట్టమొదటి సారిగా ఒక మహిళకు రెవెన్యూ అధికారిగా, మరో మహిళను శానిటేషన్ విభాగంలో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌గా అవకాశాలు కల్పించినట్లు వివరించారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడమే తమ ధ్యేయమని తెలిపారు. ప్రశంసా పత్రాలతో పాటు అన్ని సందర్భాల్లోనూ మహిళా ఉద్యోగులకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో అన్ని విభాగాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఆర్వో స్వర్ణలత, శానిటేషన్ ఇంస్పెక్టర్ ఎంజల్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ చరిత్రలో తొలిసారి మహిళలను రెవెన్యూ అధికారి, శానిటేషన్ ఇంస్పెక్టర్‌గా నియమించి, మహిళలకు సమాన అవకాశాలు ఇచ్చిన కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తాము ఆ స్థానాల్లో మొదటగా ఎంపికవ్వడం ఆనందంగా అనిపించిందన్నారు. నిజమైన మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్వో స్వర్ణలత, డీఈఈ నరేష్, సిబ్బంది శోభారాణి, శానిటేషన్ ఇంస్పెక్టర్ రాజు, ఎంజల్, తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ సేవా సదన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు






**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జి. కబర్థి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న న్యాయ సేవా సదన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పి. కమలాదేవి, ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి లక్ష్మీరాజ్యం, సీబీఐ కోర్టు న్యాయమూర్తి శోభారాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ, మొబైల్ కోర్టు జడ్జి అనూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కమలాదేవి మాట్లాడుతూ మహిళా దినోత్సవం యొక్క విశిష్టతను వివరించారు. నేటి సమాజంలో జరుగుతున్న అనేక అరాచకాలను దృష్టిలో ఉంచుకొని మహిళలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తే దేశం మరింత పురోగతి సాధిస్తుందని అన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మరియు ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచనల మేరకు నిర్వహిస్తున్న "వందరోజుల బాల్య వివాహ రహిత భారత్" కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ విభాగం సహకారంతో జిల్లాలోని 160 గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించామని చెప్పారు. అలాగే బి. అగ్రహారం, సంతె కుడ్లూరు, లింగంపల్లి గ్రామాల్లో జరుగుతున్న బాల్య వివాహాలను సకాలంలో అడ్డుకుని, సంబంధిత తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం మహిళా న్యాయమూర్తులు కమలాదేవి, లక్ష్మీరాజ్యం, శోభారాణి, సరోజనమ్మ, అనూషలను లీగల్ సర్వీసెస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నిర్మల, యూ.వి. లక్ష్మి, ఇందుమతి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సులోచన, బచ్పన్ బచావో ఆందోళన్ ఎన్జీవో ప్రతినిధి మౌనిక, డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, మహిళా ప్యానెల్ న్యాయవాదులు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు, కోర్టుల మహిళా సిబ్బంది, ప్యారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# మానసిక ఉల్లాసానికి హ్యాపీ సండే

**కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :**

ప్రజలు తమ మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం, ఆనందంగా గడపడం, ఆరోగ్యంగా ఉండడం కోసమే ప్రభుత్వం హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. ఆదివారం బిర్లా కాంపౌండ్‌లోని ఖానా-ఖజానాలో హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉద్యోగులు స్టెప్పులు వేశారు. చిన్నారులు యోగా ఆసనాలు వేశారు. మను, శ్రీ,కృష్ణ ప్రియ, సాత్వికులు చేసిన అడ్వాన్స్ యోగ వ్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజలు ప్రతిరోజూ పనుల ఒత్తిడిలో ఉంటారని, అలాంటి



పరిస్థితుల్లో కుటుంబ సభ్యులతో కలిసి కొంత సమయం ఉల్లాసంగా గడపడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని అన్నారు. హ్యాపీ సండే వంటి కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని



సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, డిఈఈ నరేష్, శానిటేషన్ ఇంస్పెక్టర్ రాజు, సిబ్బంది శ్రీదేవి, శోభారాణి, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

# దొర్నీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఘనంగా స్వాతి వేడుకలు



**రుద్రవరం.పల్లె వెలుగు :**



మండల కేంద్రం రుద్రవరం సమీపంలో ఉన్న నల్లమల్ల అటవీ ప్రాంతంలో వెలసిన దొర్నీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వాతి నక్షత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారి లక్ష్మీనరసింహులు స్వాతి నక్షత్ర వేడుకల సందర్భంగా స్వామివారికి అభిషేక పుష్పాలంకరణ నైవేద్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమాలకు భక్తులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. స్వాతి నక్షత్ర వేడుకలకు హాజరైన భక్తులకు ఆలయ నిర్వహకులు అల్పాహారము ఏర్పాటు చేశారు. స్వాతి నక్షత్ర వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా ఆలయ నిర్వహకులు వసతులు కల్పించారు.

# నేడు కర్నూలు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

**కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :**



కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశు భ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఏపీ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డి

**పల్లె వెలుగు -డోన్**





ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు నంద్యాల జిల్లా డోన్ మండలంలోని కొత్తబురుజు గ్రామంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, ప్రముఖ నాయకులు గౌరు వెంకటరెడ్డి అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఏర్పాట్ల పరిశీలన.. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కొత్తబురుజు గ్రామంలో సీఎం హెలికాప్టర్ దిగేందుకు సిద్ధం చేసిన స్థలాన్ని, భద్రతా చర్యలను అధికారులతో చర్చించారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా సీటింగ్, మంచినీరు, ఇతర సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మన్నె సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. జన సమీకరణలోను, ఏర్పాట్లలోను ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళగా పుట్టినందుకు గర్వపడాలి జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి









**పిల్లల చదువు అత్యంత ముఖ్యం విద్యావంతులను చేయాలని పిలుపు**

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

మహిళగా పుట్టినందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ స్థాయికి చేరడానికి కారణమైన తన తల్లికి మరియు అక్కడికి వచ్చిన మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, గత ఎనిమిది నెలల్లో 83 బాల్య వివాహాలను అడ్డుకున్నామని తెలిపారు. ఒక మహిళ చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని, మహిళల్లో అపారమైన శక్తి ఉందని పేర్కొన్నారు. ప్రతి బిడ్డకు తల్లే మొదటి దైవమని చెప్పిన కలెక్టర్, ఆడపిల్లలను బాగా చదివించి వారు తమ కాళ్లపై తాము నిలబడే వరకు పెళ్లిళ్లు చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే కొడుకులకు ఆడపిల్లలను గౌరవించడం నేర్పించాలని కోరారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాల ద్వారా మద్దతు అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజ్ కింద సుమారు 1,30,000 మంది మహిళలకు రూ.1200 కోట్ల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. స్త్రీనిధి కింద 25,341 మంది మహిళలకు రూ.195 కోట్ల ఆర్థిక సహాయం అందించామని చెప్పారు. ఉన్నతి, పీఎం అజయ్ పథకాల కింద 208 స్వయం సహాయక బృందాలకు రూ.176 కోట్ల మద్దతు లభించిందన్నారు. అలాగే ఉన్నతి పథకం కింద 1,698 మంది మహిళలకు రూ.8.5 కోట్ల సాయం అందిందన్నారు. సీఐఎఫ్, వీవీజీఎఫ్, వీఆర్ఎఫ్, పీఎంఈజీపి వంటి పథకాల ద్వారా కూడా వేలాది మహిళలకు కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మెప్మా ద్వారా 4,502 స్వయం సహాయక బృంద సభ్యులకు రూ.613 కోట్ల సహాయం అందుతుందని చెప్పారు. మొత్తంగా సుమారు 1,62,782 మంది మహిళలకు రూ.2,200 కోట్ల ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. విద్యాభివృద్ధి కోసం జిల్లాలో ఇప్పటికే సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ హాస్టళ్లు ఉన్నప్పటికీ, మరిన్ని హాస్టళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ ఏడాది 78 సీజనల్ హాస్టళ్లు ప్రారంభించి 4 వేల మంది పిల్లలకు విద్య అందిస్తున్నామని చెప్పారు. తల్లిదండ్రులు పనుల కోసం వలస వెళ్తూ పిల్లలను వెంట తీసుకెళ్లకుండా హాస్టళ్లలో ఉంచి చదివించాలని సూచించారు. జిల్లాలో అక్షరాస్యత శాతం కేవలం 57 శాతం మాత్రమే ఉందని, దీనిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'అక్షరాంధ్ర' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోనే 1,61,000 మంది మహిళలు, వృద్ధులు నమోదు చేసుకున్నారని చెప్పారు. రెండు నెలల పాటు వారికి విద్యాబోధన జరగగా, ఇటీవల జరిగిన ప్రీ ఫైనల్ పరీక్షలో 94 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఓర్వకల్లు ప్రాంతంలో పరిశ్రమలు స్థాపనతో భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, అందుకే ప్రతి ఒక్కరు తమ పిల్లలను చదివించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ, స్త్రీ లేనిదే సృష్టి లేదని, స్త్రీని గౌరవించే సమాజమే అభివృద్ధి చెందుతుందని అన్నారు. స్త్రీ పట్టుదల, ఓర్పు, సహనం, త్యాగాలను ఎప్పటికీ మరవకూడదన్నారు. గ్రామ స్థాయి వార్డు సభ్యుల నుంచి పార్లమెంట్ వరకు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. 1995లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన డ్వాక్రా పొదుపు ఉద్యమం మహిళల ఆర్థిక స్థితిని బలోపేతం చేసిందని అన్నారు. ఒకప్పుడు నెలకు రూ.30 పొదుపు చేసిన మహిళలు ఇప్పుడు రూ.1000 వరకు పొదుపు చేసే స్థాయికి ఎదిగారని చెప్పారు. ఓర్వకల్లు మండలంలో మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఎంఎస్ఎంఈల ద్వారా 'దిలీప్' అనే సంస్థ ముందుకు వచ్చిందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ, ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులు, రాష్ట్రపతులుగా బాధ్యతలు చేపట్టి దేశాన్ని నడిపించారని చెప్పారు. విద్య, వైద్యం, శాస్త్రసాంకేతిక రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాలు అధిరోహించారని తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ, ప్రతి మగవాని విజయానికి వెనుక ఒక స్త్రీ ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు రాజకీయాలు సహా అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ, మెప్మా ద్వారా వివిధ పథకాల కింద లబ్ధిదారులైన దాదాపు 1.62 లక్షల మంది మహిళలకు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2,201 కోట్ల ఆర్థిక సహాయాన్ని చెక్‌ల రూపంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ సావిత్రి, వడ్డెర సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చంద్రిక, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సంజీవ లక్ష్మి, బొందిల్ల కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, ఓర్వకల్లు పొదుపు ఐక్య సంఘం అధినేత విజయభారతి, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, జిల్లా అధికారులు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**



రైతుల సంక్షేమమే లక్ష్యంగా, ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా భూమి హక్కులను కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని పాణ్యం ఎమ్మెల్యే, టీడీపి నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కల్లూరు మండలం నాయకల్లు గ్రామంలో "మీ భూమి మీ హక్కు" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను ఆమె రైతులకు పంపిణీ చేశారు. వివాద రహిత భూ యాజమాన్యం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో భూములకు సంబంధించి అనేక వివాదాలు ఉండేవని, వాటిని పరిష్కరించి రైతులకు పూర్తి భద్రత కల్పించేలా రాజముద్రతో కూడిన పాసు పుస్తకాలను అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారిక ముద్రతో కూడిన ఈ పుస్తకాలు రైతులకు కొండంత అండగా ఉంటాయని ఆమె ఆకాంక్షించారు. మహిళా దినోత్సవ వేడుకలు అనంతరం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామంలోని మహిళలతో కలిసి ఎమ్మెల్యే వేడుకలు జరుపుకున్నారు. మహిళల మధ్య కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని, ప్రతి రంగంలోనూ మహిళలు రాణించాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.పాల్గొన్న ముఖ్య నేతలు, అధికారులు ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపిడిఓ నాగశేషాచల రెడ్డి, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కే. పార్వతమ్మ, కేంద్ర ప్రభుత్వ డైరెక్టర్ సోమశేఖర రెడ్డి, ఏపీ డైరెక్టర్లు రామాంజనేయులు, రామ గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.అలాగే ఉలిందకొండ సొసైటీ చైర్మన్ ఈవీ రమణ, మాజీ ఎంపీపీ వాకటి మాధవి, తడకనపల్లి సర్పంచ్ సహరాబి, నాయకులు మాదేశ్, కొంగనపాడు వినోద్, సల్కాపురం దేవేందర్ రెడ్డితో పాటు ఉమ్మడి కూటమి పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు.

# స్టార్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగాఅంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు







**నంద్యాల మార్చి 08 (పల్లె వెలుగు ):**

నంద్యాల పట్టణం వైయస్సార్ నగర్ లో ఉన్న స్టార్ సొసైటీ నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం అత్యంత వైభవముగా స్టార్ సొసైటీ వారు నిర్వహించారు ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ సభ్యురాలు ఎరుకల రాజేశ్వరమ్మ పాల్గొని ముందుగా కేక్ కట్ చేసి,వివిధ రంగాలలో సేవలందించిన మహిళలను సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సృష్టికి మూలం మహిళ, శక్తికి రూపం మహిళ. ఒక అమ్మగా ప్రేమను, భార్యగా తోడును, సోదరిగా అనురాగాన్ని పంచడమే కాకుండా, నేడు ప్రతి రంగంలోనూ, తనదైన ముద్ర వేస్తూ, సమాజ గవనాన్ని మారుస్తుంది. ఓర్పులో భూదేవిని, ధైర్యంలో ఆదిశక్తిని తలపించే ప్రతి మహిళా మూర్తికి నా హృదయపూర్వక కృతజ్ఞతలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 30 మంది మహిళలను శాలవాలతో, చీరలతో, స్వీట్స్ గాజులు పండ్లతో సత్కరించడమైనది.

సత్కరించబడిన మహిళలు ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మాంత్రి కమిటీ సభ్యురాలు అంబడిపూడి చిన్నమ్మ, ఎన్ ఎస్ సి బి ఏ వి నాగలక్ష్మి, దళిత వెల్ఫేర్ అసోసియేషన్ భాగ్యమ్మ, చిన్నారి, ఆరోగ్య కార్యకర్త పి వెంకటలక్ష్మి, హుస్సేన్ బి, సాంప్రజిక కార్యకర్త లక్ష్మీదేవి, శారద, కమలబి, తదితరులను నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు వేసిన డాన్స్ లు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్టార్ సొసైటీ ప్రధాన కార్యదర్శి గడ్డం సుబ్బరాయుడు, దళిత వెల్ఫేర్ అసోసియేషన్ సామేలు, రవిబాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**పల్లె వెలుగు నంద్యాల క్రైమ్.**



నంద్యాల పట్టణం నూనెపల్లె బొగ్గులైన్ రోడ్డు నందు జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన కామిరెడ్డి రాజ ఇమ్మనియేల్ విన్సన్ చర్చిల్ (62) ద్విచక్ర వాహనం పై వెళుతుండగా వేగంగా దూసుకెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనగా ద్విచక్ర వాహనం పై వెళ్తున్న ఇద్దరిలో ఒకరైన కామిరెడ్డి రాజ ఇమ్మనియేల్ విన్సన్ చర్చిల్ అక్కడికక్కడే మృతిచెందారు . ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు పట్టణంలోని సెయింట్ లూక్స్ అంధుల పాఠశాలలో ఫీల్డ్ ఆఫీసర్ గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య కుమారుడు, కూతురు ఉన్నారు. నూనెపల్లె బొగ్గులైన్ రోడ్డు నందు అనేక రోడ్డు ప్రమాద ఘటనలో అనేక మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## అజ్ఞాత వ్యక్తి మృతి బంధువుల కోసం పోలీసుల విజ్ఞప్తి

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**



కర్నూలు నగరంలోని బంగారుపేట సమీపంలో శనివారం సుమారు 60 సంవత్సరాల వయస్సు గల ఓ అజ్ఞాత వ్యక్తి అస్వస్థతకు గురై పడిపోయిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు గమనించి వెంటనే అతన్ని కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి పేరు, చిరునామా వివరాలు ఇంకా తెలియరాలేదని వెల్లడించారు.మరణించిన వ్యక్తి నల్ల రంగు ఫుల్ షర్ట్ మరియు నీలం రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.ఈ వ్యక్తికి సంబంధించిన బంధువులు లేదా పరిచయస్తులు ఎవరైనా ఉంటే వెంటనే కర్నూలు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ నాగరాజరావును సంప్రదించాలని పోలీసులు కోరారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 9121101060.

## మహదేవపురంలో టీడీపీకి షాక్..

## 200 మంది వైసీపీలో చేరిక



**పల్లె వెలుగు సిరివెళ్ల.**

సిరివెళ్ల మండల పరిధిలోని నల్లమల అడవి సమీప గ్రామం మహదేవపురంలో తెలుగుదేశం పార్టీకి భారీ షాక్ తగిలింది. గ్రామంలో అధికార పార్టీ నాయకులపై ప్రజల్లో అసంతృప్తి పెరగడంతో రాజకీయ సమీకరణాలు మారాయి. వైసీపీ యువనేత కంపరాజు రాజేష్ గౌడ్ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, కార్యకర్తలు కలిపి సుమారు 200 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కర్నూలునంద్యాల ఉమ్మడి జిల్లాల వైసీపీ పరిశీలకుడు గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రరెడ్డి (నాని) సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యం ఉంటుందని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని నాయకులు తెలిపారు. మహదేవపురం గ్రామం నుంచి సుమారు 30 వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు ఆళ్లగడ్డకు చేరుకుని పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ ఇందూరి ప్రతాప్ రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం, మందాల శివారెడ్డి, జింకల నాగన్న, గుండంపాడు ప్రతాప్ రెడ్డి, కొట్టే జయలక్ష్మమ్మ, పిక్కిలి నరహరి, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఇనుప రాడ్డుతో దాడి.. విద్యార్థి మృతి

**-తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న 6 మంది విద్యార్థులు.**



**హోళగుంద పల్లె వెలుగు మార్చి 08**

తొమ్మిదో తరగతి విద్యార్థి విచక్షణ కోల్పోయాడు. కర్ణాటకలోని బళ్లారి జిల్లాలో శనివారం రాత్రి అత్యంత భయంకరమైన ఘటన చోటుచేసుకుంది. ఓ విద్యార్థి తన తోటి విద్యార్థులను ఇనుప రాడ్డు,చాకు తో దాడి చేయడంతో ఒక విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన బళ్లారిలోని తాళురు రోడ్డులో ఉన్న గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్ హాస్టల్లో శనివారం రాత్రి సుమారు 10.30 గంటలప్పుడు చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే హొళగుంద మండలం సమ్మతగేరి గ్రామానికి చెందిన అడ్వకేట్ బి.లక్ష్మీకాంత్,సరిత పెద్ద కుమారుడు హేమంత్(14సం) బళ్లారి గురుకుల ఇంటర్నేషనల్ స్కూల్ హాస్టల్లో ఉంటూ 9వ తరగతి చదువుతున్నాడు. తమ తోటి చదువుతున్న భరత్ అనే విద్యార్థి ఉన్మాదిలా మారి తోటి విద్యార్థులపై ఒక్కసారిగా ఇనుప రాడ్డు,చాకు తో ఏడు మంది విద్యార్థులపై మరియు అడ్డుకోవడానికి వచ్చిన వార్డెన్ పై దాడి చేసి పరారయ్యాడు. హేమంత్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. మిగతా 6 మంది విద్యార్థులు తీవ్ర గాయాలతో బళ్లారి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఘటనా స్థలానికి చేరుకున్న టీబీ డ్యాం రైతు సంఘం గౌరవ అధ్యక్షులు,మాజీ ఎల్ ఎల్ సి డిస్ట్రిబ్యూటర్ వన్ చైర్మన్ తప్పెట రామిరెడ్డి,మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇనుప రాడ్డు మరియు చాకు వంటి మరణాయుధాలు హాస్టల్లోకి రావాలంటే పాఠశాల మేనేజ్మెంట్ నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బళ్ళారి పోలీసులు పరారైన నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. బాలుడు మృతి చెందడంతో సమ్మతిగేరి గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.?

## రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన కేడీసీసీ బ్యాంక్ సీఈఓ శివలీల

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**



ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కెడీసీసీ ) సీఈఓ శివలీల ఈరోజు నంద్యాలలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ భేటీలో భాగంగా సీఈఓ మంత్రి ఫరూక్ కి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో కేడీసీసీ బ్యాంకు ద్వారా రైతులకు, ఖాతాదారులకు అందుతున్న సేవలను, బ్యాంక్ ప్రగతిని మంత్రి ఫరూక్ కి వివరించారు. సహకార రంగం బలోపేతానికి, రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా బ్యాంక్ కార్యకలాపాలు సాగాలని ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ సూచించారు . ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# సమాజంలో మహిళల పాత్ర కీలకం !

**ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ**

**మహిళలకు చీరలు పంపిణీ**

**హోళగుంద పల్లె వెలుగు మార్చి 08**





సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని , వారి సేవలను వెలకట్టలేమని తెలుగుదేశం మాజీ రాష్ట్ర కార్యదర్శి చిన్న హేట శేషగిరి, ఏఎస్ఐ నాగరాజు, ఎంఈఓ 2 కబీర్ సాబ్ ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సిహెచ్ నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక సీజనల్ హాస్టల్లో అంతర్జాతీయ మహిళల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు సావిత్రిబాయి పూలే, మదర్ తెరిసా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల లేనిదే సృష్టి లేదని వారికి సమాన హక్కులు, కల్పించడం తో పాటు సమానంగా గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని గుర్తు చేశారు. స్త్రీ సేవలు వెలకట్టలేనివి అన్నారు . అనంతరం ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ సహకారంతో మహిళలకు చీరల పంపిణీ చేసి గౌరవించారు కార్యక్రమానికి వచ్చిన అతిథులను శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ హెచ్ చలపతి, చిన్న హేట ఎంపీపీ ఎస్ పాఠశాల హెచ్ఎం కేకే మారెప్ప, ఇంచార్జ్ హెచ్ఎం పాండురంగ, హెల్త్ అసిస్టెంట్, నాగరాజు, కురువ సంఘం నాయకులు మల్లికార్జున, బుడగ జంగాల నాయకులు డొక్కా జంపన్న, కానిస్టేబుల్ షేక్షావలి , నాయకులు మూర్తి ,ఎర్రి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కల్లూరులో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం







**జర్నలిస్టులు, ప్రజల కోసం మెగా ఉచిత వైద్య శిబిరం**

**ముఖ్య అతిథుల చేతుల మీదుగా మహిళా ప్రముఖులకు**

**సత్కారం సుమారు 200 మందికి వైద్య పరీక్షలు..**

**ఉచితంగా కళ్ళద్దాల పంపిణీ**

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

ంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్లూరులోని ఆదిత్య పాఠశాలలో ఆదివారం మహిళా జైత్రయాత్ర వెల్లివిరిసింది. యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం గౌరవాధ్యక్షులు పి.యూసుఫ్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా, ప్రజల మరియు జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. సంయుక్త ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం: యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం జిల్లా కమిటీ, తెలకపల్లి నరసింహయ్య గ్రంథాలయం, కల్లూరు ఫోటో & వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మరియు జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కర్నూలు జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ కే.జీ. గంగాధర్ రెడ్డి, ఆదిత్య విద్యా నిలయం కరస్పాండెంట్ వాసుదేవయ్య, భారత చైతన్య యోజన పార్టీ రాష్ట్ర ఈసీ సభ్యులు వరుణ్ కుమార్ యాదవ్ ల ప్రత్యేక సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. అందుబాటులోకి కార్పొరేట్ వైద్యం: ఈ శిబిరంలో ప్రముఖ ఆసుపత్రులు తమ సేవలను ఉచితంగా అందించాయి: మెడికవర్ హాస్పిటల్: డాక్టర్ సబ, ఏజీఎం ఖాదర్ బాషా, జీఎం మోహన్ రెడ్డిల పర్యవేక్షణలో బీపీ, షుగర్ మరియు ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. వెంకట సాయి రాయల్ డెంటల్ క్లినిక్: డాక్టర్ సాయి పంకజ్ ఆధ్వర్యంలో సుమారు 25 మందికి దంత పరీక్షలు చేశారు. శాంతిరామ్ ఐ హాస్పిటల్: ఆప్తాల్మాలజిస్ట్ వెంకటరామం బృందం కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి కే.జీ. గంగాధర్ రెడ్డి సౌజన్యంతో ఉచితంగా కళ్ళద్దాలను పంపిణీ చేయనున్నారు. మహిళా ప్రముఖులకు గౌరవం: ఈ సందర్భంగా సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రను కొనియాడుతూ పలువురు మహిళా ప్రముఖులను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈఓ శ్రీనివాసులు, అడ్వకేట్ సౌభాగ్య ధరణి, ఐద్వా నాయకురాలు కిరణ్మయి, రుదిరోద్గారి ఎడిటర్ చిన్ని మాట్లాడుతూ.. ఆడ, మగ అనే వివక్ష లేకుండా పిల్లలను పెంచినప్పుడే సమాజం పురోగమిస్తుందని పేర్కొన్నారు. హాజరైన ప్రముఖులు: ఈ కార్యక్రమంలో యుజెఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు నీలం సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిలిగిత్త విజయ్ కుమార్, ఉమ్మల్ల రాజశేఖర్, నాయకులు దండు విద్యాసాగర్, నగర అధ్యక్షుడు నాగేంద్రుడు,మల్లికార్జున, తెలకపల్లి గ్రంధాలయం కమిటీ సభ్యులు కే. ప్రభాకర్, దనేష్, అజాద్ మరియు పెద్ద సంఖ్యలో విలేకరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. సుమారు 200 మంది ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్బంగా మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేసిన... కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా





**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :**





అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్భంగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేత కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కర్నూలు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ...మహిళలందరికి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా దినోత్సవ వారోత్సవాలలో జరిగిన ఆటల పోటిలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశామన్నారు. మహిళా పోలీసులు సమాజ భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.
అమ్మలేనిదే సృష్టి లేదన్నారు. భారతదేశం వసుదైవ కుటుంబం అనే భావనతో ముందుకు సాగుతుందని, అందరూ కలిసి మెలిసి మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. మహిళల భద్రత కు మరియు శాంతి భద్రతల పరిరక్షణలో వారి సేవలు ఎంతో ప్రశంసనీయమన్నారు. ఉత్సాహంతో పని చేస్తూ ప్రజలకు మంచి సేవలందించాలని సూచించారు.పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ విధుల్లోనే కాకుండా క్రీడలలో కూడా మహిళలకు స్ఫూర్తిగా రాణిస్తున్న ఆర్ ఎస్సై కల్పన ని అడిషనల్ ఎస్పీ శాలువ, మెమోంటోతో ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఎఓ విజయలక్ష్మీ, డిటిఆర్బి సిఐ ఆదిలక్ష్మీ, ఆర్ ఐ నారాయణ, మహిళా ఆర్ ఎస్సైలు కల్పన, మహాలక్ష్మీ, మహిళా పోలీసు సిబ్బంది శక్తి టీం, మహిళా హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

**కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డితో కలిసి హెలిప్యాడ్, సభా ప్రాంగణం తనిఖీ..రేపు డోన్ నియోజకవర్గం కొత్త బురుజుకు రానున్న సిఎం చంద్రబాబు. అధికారులకు కీలక సూచనలు చేసిన ఎమ్మెల్యేలు**





**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు (సోమవారం) డోన్ నియోజకవర్గంలోని కొత్త బురుజు గ్రామంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పాణ్యం ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి , డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి: కొత్త బురుజు గ్రామంలో సిఎం హెలికాప్టర్ దిగడానికి ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని, అలాగే బహిరంగ సభ జరగబోయే ప్రాంగణాన్ని ఎమ్మెల్యేలు అధికారులతో కలిసి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, నీడ, పార్కింగ్ వసతులను పక్కాగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమన్వయంతో ముందుకు: ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని, నంద్యాల జిల్లా యంత్రాంగం మరియు పార్టీ శ్రేణుల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఈ పర్యటనను విజయవంతం చేయడానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరి జీవితంలో ఎన్నో ముఖ్య పాత్రలు పోషిస్తున్న మహిళలకి ఓ ప్రత్యేక రోజు అదే అంతర్జాతీయ మహిళా దినోత్సవం





**గడివేముల పల్లె వెలుగు దినపత్రిక**

నంద్యాల జిల్లా గడివేముల మండలం మహిళా సమైక్య కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గౌరవ సలహాదారురాలు బత్తుల సుభద్రమ్మ, రాష్ట్ర మార్క్ ఫీడ్ మెంబర్ వడ్డు లక్ష్మీదేవి,పాణ్యం మార్కెట్ యార్డ్ చైర్మన్ అంగజాల గీత, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎల్లమ్మ, ప్రాజెక్టు మేనేజర్ జ్యోతి వీరి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ వ్యక్తి జీవితంలో స్త్రీ చాలా పాత్రలు పోషిస్తుంది. తల్లి మొదలు, చెల్లి, భార్య, గురువు ఇలా ఎన్నో బాధ్యతలను ఆమె అలవోకగా చేయగలదు. ఆమెలోని గొప్పదనం ఏంటంటే ఓ వైపు ఇంటిని చక్కబెడుతూనే మరోవైపు సంఘంలోనూ ఎన్నో రోల్స్ పోషిస్తుంది. మగవారికి సమానంగా టీచర్, ఇంజనీర్, పైలెట్ వంటి బాధ్యతలను కూడా ఆమె స్వీకరించి వందశాతం వాటికి న్యాయం చేస్తుంది. నేటి కాలంలో స్త్రీలు సాధించిన విజయాలు నిజంగా ఆకాశాన్నంటాయి. వీటన్నింటికి ప్రతీకగా ప్రపంచంలోని మహిళల కోసం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'ని ఏర్పాటు చేశారు. ముందుకాలంతో పోల్చితే రోజురోజుకి మహిళలు ముందుకు సాగుతున్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో వారి పాత్ర కీలకం. ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుగుతుంది. మహిళా దినోత్సవం లక్ష్యం.. లింగ సమానత్వాన్ని జరుపుకుంటారు. ఈ రోజున వివిధ రంగాల్లో విజయాలు సాధించిన మహిళల్ని గుర్తించి వారికి గౌరవిస్తారు. సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక కార్యక్రమాల్లో స్త్రీ, పురుషులు సమానమని చెప్పడమే ముఖ్య ఉద్దేశ్యం. సమాజంలో చిన్న పిల్లలకు బాల్య వివాహాలు చేయడం వలన వాటి అనర్థాల గురించి వివరించారు. అదే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఏ దేశానికి, సంస్థ, సంఘానికి మాత్రమే పరిమితం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా దీనిని జరుపుకుంటారు. ఈ రోజుని సెలబ్రేట్ చేసుకోవడానికి లింగ బేధం కూడా ఉండదు. దీనిని ప్రతి ఒక్కరూ కూడా సెలబ్రేట్ చేసుకోవచ్చు. మీ జీవితంలో ఎన్నో పాత్రలు పోషించిన స్త్రీలు ఉంటారు. అమ్మ, గురువు, అక్క, చెల్లి,భార్య, ఇలాంటి ఎన్నో ముఖ్య పాత్రలు పోషిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.అందరికీ హ్యాపీ ఉమెన్స్ డే భావించి జరుపుకుంటారు అందుకే ఈరోజు ఒక ప్రత్యేక రోజుగా గుర్తించి మహిళా దినోత్సవం గా ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, వివో ఏలు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలిన కూటమి ప్రభుత్వం





**ఆళ్లగడ్డ, ప్రతినిధి మార్చి 8 పల్లె వెలుగు**

మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి టిడిపి ఎంపీటీసీ తో సహా 35 మంది కార్యకర్తలు వైకాపాలో చేరిక మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే గంగుల నాని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచిందని, సూపర్ సిక్స్ పథకాలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని మాజీ శాసన మండల విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం సిరివెళ్ల మండలం మహాదేవపురం గ్రామానికి చెందిన తెదేపా ఎంపీటీసీ షేక్ శంషాద్ బీ తోపాటు 35 కుటుంబాలు తెదేపా ను వీడి వైకాపాలో చేరారు. ఈ సందర్భంగా గంగుల ప్రభాకర్ రెడ్డిమాట్లాడుతూ తమ నాయకత్వాన్ని నమ్మి తెదేపా ను వీడి వైకాపాలో చేరిన అందరికీ అన్ని విషయాల్లోఅండగా ఉంటామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రతినెల ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా ప్రజలకు పండుగలా ఉండేది అన్నారు. వైసీపీ చేపట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా అందించడం జరిగింది అన్నారు. కూటమి ప్రభుత్వంలో చేపట్టిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు సూపర్ ఫ్లాప్ అయ్యాయన్నారు. ఏ ఒక్క పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందన్నారు. ఇప్పటికే మూడు వార్షిక బడ్జెట్లు ప్రవేశ పెట్టడం జరిగిందని అందులో సంక్షేమ పథకాలకు నిధులు పెట్టకపోవడం గమనార్హం అన్నారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, రైతు భరోసా, ఫీజు రీయింబర్స్మెంట్ పథకాలు అందనంత దూరంలో ఉన్నాయని విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రి తో కుమ్మక్కై రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నీరు కార్చారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు తన మనసు మార్చుకొని ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే గంగుల నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను సహించలేక చాలా మంది తెదేపాను వీడి వైకాపాలో కి రావడం శుభ పరిణామం అన్నారు. సూపర్ సిక్స్ ను గాలికి వదిలేసారని నిగ్గదీసి అడిగే వారిపై కేసులుపెట్టడం పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. నియోజక వర్గంలో అన్యాయాలు అక్రమాలు పెరిగిపోతున్నాయని ఆయన విమర్శించారు. వైసీపీలో చేరిన వారందరినీ మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామని అరమరికలు లేకుండా అందరము పని చేసి రాబోయే ఎన్నికల్లో పార్టీని గెలిపించే దిశగా పనిచేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరివెళ్ల వైకాపా నాయకులు అబ్దుల్ సలాం, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నరహరి వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లోన్ యాప్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**గుర్తు తెలియని లేదా అనుమానాస్పద లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు.**


**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**

**పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :**




ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్‌ల ద్వారా అందుబాటులో ఉన్న వివిధ లోన్ యాప్‌ల ద్వారా మోసాలు పెరుగుతున్నాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది మోసగాళ్లు సోషల్ మీడియాలో , మెసేజ్‌లు లేదా ఫోన్ కాల్స్ ద్వారా తక్కువ సమయంలో సులభంగా లోన్ ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఈ లోన్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసిన తర్వాత మొబైల్‌లో ఉన్న కాంటాక్టులు, ఫోటోలు, వ్యక్తిగత సమాచారం వంటి వివరాలను యాక్సెస్ చేసి, తరువాత ఎక్కువ వడ్డీ వసూలు చేయడం లేదా బెదిరింపులకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కర్నూలు ఎస్పీ తెలిపారు. జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలకు ఈ క్రింది సూచనలు చేశారు. గుర్తు తెలియని లేదా అనుమానాస్పద లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దు.లోన్ అవసరం ఉన్నప్పుడు అధికారిక బ్యాంకులు లేదా గుర్తింపు పొందిన ఆర్థిక సంస్థలను మాత్రమే సంప్రదించాలి.తెలియని లింకులు, మెసేజ్‌ల ద్వారా వచ్చిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేయరాదు. ఎవరైనా లోన్ యాప్ పేరుతో బెదిరింపులకు పాల్పడితే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.లోన్ యాప్ మోసాలకు గురైన వారు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు కాల్ చేయడం లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.లేదా కేంద్ర ప్రభుత్వ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# శ్రీ మద్దిలేటి లక్ష్మి నరసంహా స్వామి క్షేత్రంలో స్వాతి నక్షత్ర వేడుకలు



**పల్లెవెలుగు బేతంచెర్ల ప్రతినిధి (మార్చి 8) :**



బేతంచెర్ల మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో స్వాతి నక్షత్రం వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉప కమిషన్ రామాంజనేయులు, వేద పండితులు , ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుంచి సహస్రదీపాలంకరణ సేవ నిర్వహించి ,అనంతరం మంగళ వాయిద్యాల నడుమ స్వామి అమ్మవార్ల ను ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వాలంటీర్ విభాగం అధ్యక్షునికి మాజీ మంత్రి బుగ్గన పరామర్శ

**బేతంచెర్ల మార్చి 8 (పల్లెవెలుగు)**



ఈరోజు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇటీవల నంద్యాల జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్ కి శాస్త్ర చికిత్స జరిగినందువలన వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు.వారితో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు , ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి ,మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్ , మండల అధ్యక్షులు సోమేష్ యాదవ్ ,పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి ,మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామచంద్రుడు ,పార్టీ నాయకులు ఆర్.ఇ రాజవర్ధన్ ,పాలుట్ల రఘురామ్ ,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో స్త్రీ పాత్ర ముఖ్యమైనది -ఎంపీడీవో నూర్జహాన్ బేగం





ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 8 పల్లె వెలుగు

అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గం స్థాయి లో ఆళ్లగడ్డ ఎంపీడీవో సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీఓ నూర్జహాన్ బేగం పాల్గొని మహిళల గురించి మాట్లాడుతు సమాజంలో స్త్రీ పాత్ర సమానత్వం, విద్య, వివాహల, ఉద్యోగంల వివరించారు. ఆళ్లగడ్డ ఏరియా కోఆర్డినేటర్ విజయ గోపాల్ మహిళ పాత్ర తదితర అంశాల గురించి వివరించారు అనంతరం ఎంపీడీవో నూర్జహాన్ బేగం మెప్మా సీఎం ఏం సుజాత తదితర వారిని శాలువలతో ఘనంగా సన్మానించారు ఆళ్లగడ్డ, చాగలమర్రి, రుద్రవరం, దొర్నిపాడు, సిరివెళ్ల&ఉయ్యాలవాడ మండలం ల ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్‌లు, విఓఏలు,వి ఓఓబీలు, మెప్మా సిఎంఎం సుజాత మెప్మా సిబ్బంది & పొదుపు మహిళ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గం స్థాయిలోని మహిళా సిబ్బందికి అన్ని మండలాల ఎంఎంఎస్ అధ్యక్షులను శాలువతో సన్మానించడం జరిగింది.

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు

**నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న కర్నూలు పోలీసులు.చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి.**







పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :

కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.(సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# బోడె రామచంద్ర యాదవ్ సమక్షంలో బిసివై పార్టీలో భారీ చేరికలు

**500 మంది నాయకులు, కార్యకర్తలు బిసివై పార్టీలో చేరిక బహుజన రాజకీయ శక్తి బలోపేతమే లక్ష్యం**





కాశినాయన మార్చి 8 (పల్లె వెలుగు)

బద్వేల్ నియోజకవర్గం కాశినాయన మండలంలోని గొంటువారిపల్లె గ్రామంలో రేగులగడ్డ వారి కుటుంబంలో నిర్వహించిన కేశ ఖండన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బిసివై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన పోరుమామిళ్ల పట్టణానికి చేరుకుని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నాయకులు, కార్యకర్తలతో కలిసి గొంటువారిపల్లె గ్రామానికి వెళ్లి కేశ ఖండన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.తరువాత జరిగిన కార్యక్రమంలో బిసివై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున బిసివై పార్టీలో చేరారు. దాదాపు 500 మంది నాయకులు, కార్యకర్తలు పార్టీ కండువా కప్పుకుని బిసివై పార్టీలో చేరడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పార్టీ నాయకులు వారిని సాదరంగా ఆహ్వానిస్తూ పార్టీ బలోపేతానికి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ కాశినాయన మండలంతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని తెలిపారు. ఈ మండలానికి పెద్దల ఆహ్వానం మేరకు ఇప్పటికే మూడు సార్లు వచ్చానని, ఇక్కడి ప్రజలతో ముఖ్యంగా బీసీ సోదరులతో కలవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని తాను సంకల్పించుకున్నానని చెప్పారు. అలాగే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రజలను, ముఖ్యంగా రాయలసీమ ప్రాంత ప్రజలను మోసం చేస్తోందని ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అబద్ధపు మాటలతో ప్రజలను నమ్మించి ఇప్పుడు నట్టేట ముంచారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కొన్ని వర్గాలకే పరిమితమయ్యాయని, సామాన్య బహుజన వర్గాలకు సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని అన్నారు. మన రాష్ట్రంలో ఎప్పుడూ రెడ్డి ప్రభుత్వమో లేక నాయుడు ప్రభుత్వమో మాత్రమే ఉంటుందా అనే ప్రశ్నను ప్రజల ముందు ఉంచుతూ బహుజన వర్గాల రాజకీయ శక్తిని పెంచేందుకు బిసివై పార్టీని స్థాపించామని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు కలిసి బహుజన శక్తిగా ఎదిగితేనే నిజమైన రాజకీయ మార్పు సాధ్యమవుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో బద్వేల్ నియోజకవర్గం నుంచే బిసివై పార్టీ బలోపేతం ప్రారంభమవుతుందని ఆయన స్పష్టం చేశారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని విస్తరించి ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు. అలాగే త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసివై పార్టీ పూర్తిస్థాయిలో పోటీ చేస్తుందని, ప్రజలు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిపిరిబోయిన రమేష్ యాదవ్, రామమోహన్, నూరె నిర్మలా, రేగులగడ్డ నారాయణ, శ్రీవరపు నరసింహా యాదవ్, పోలు మురళి కృష్ణ యాదవ్, రామయ్య, ఉంటా నరసింహా, శ్రీనివాసులు, సూర్యనారాయణ, హుస్సేనయ్య, బాలకృష్ణ, గురప్పుడు, చిన్న నారాయణ, మాధవ్, కిట్టయ్య, తిరపతయ్య, బాలారోశయ్య, బాల పిచ్చయ్య, బాల ఇసాయ్య తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఐదు లక్షల ప్రమాద బీమా మీ కుటుంబానికి భరోసా

## జిల్లా జనసేన పార్టీ పరిశీలకులు కిలారి వెంకట రోశయ్య

ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 8





జనసేన పార్టీ సభ్యత్వాలపై అవగాహన కార్యక్రమం జనసేన పార్టీ జనం పార్టీ ఇరిగేల రాంపుల్లారెడ్డిఆళ్ళగడ్డ తాలూకా జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం నాడు జనసేన సభ్యత్వాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా పార్లమెంట్ జనసేన పార్టీ పరిశీలకులు పొన్నూరు మాజీ శాసనసభ్యులు కిలారి వెంకట రోశయ్య పాల్గొని దిశానిర్దేశము చేశారు. ఈ సందర్భంగా..జనసేన ఉద్యమి సభ్యత్వం వలన కలిగే ప్రయోజనాలు గురించి కార్యకర్తలకు వివరంగా ఆయన వివరించారు. పార్టీలో సభ్యత్వం వలన పార్టీ సభ్యునిగా గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు అలాగేపార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత. పార్టీ కమిటీల్లో బాధ్యతలు అప్పగించేందుకు సభ్యత్వం తప్పనిసరి అన్నారు. సభ్యత్వం ఉన్న వారికి మాత్రమే నాయకత్వ బాధ్యతలు ఉంటాయన్నారు. నాయకత్వ ట్రైనింగ్, నాయకులుగా ఎదిగే అవకాశాలు ఉంటుందని అలాగే5 లక్షల ప్రమాద బీమా ద్వారా మీ కుటుంబానికి భరోసా ఉంటుందని జనసేన పార్టీ సభ్యత్వ నమోదు లో సాధకులు క్రియాశీలక పాత్ర పోషించాలని కిలారి వెంకట రోశయ్య తెలిపారు అనంతరం జనసేన సీనియర్ నాయకుడు ఇరిగెల రాంపుల్లా రెడ్డి , జనసేన పార్టీ గురించి సిద్ధాంతాల పార్టీ ముఖ్యాంశాల గురించి క్లుప్తంగా పార్టీ కార్యకర్తలకు వివరించారు ఈ కార్యక్రమంలో ఇరిగెల రామచంద్ర రెడ్డి ,ఇరిగెల సూర్య నారాయణ రెడ్డి ఇరిగెల విశ్వనాథ్ , ఇరిగెల ప్రతాప్ రెడ్డి , ఇరిగెల భరత్ రెడ్డి , ఇరిగెల సుధాకర్ రెడ్డి , జున్ను ప్రసాద్ రెడ్డి , మండల నాయకులు, జనసైనికులు, సభ్యత్వ నమోదు వాలంటరీలు, పార్టీ శ్రేణులు తదితరులు భారీగా పాల్గొన్నారు. అంతకుముందు అక్కడ చేరుకున్న పార్టీ పరిశీలకులు కిలారి వెంకట రోశయ్యకు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు.

# హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఇండియా స్టేట్ ప్రెసిడెంట్గా రాయుడు ఎంపిక





Regd. No. PB-10-0046463
HUMAN RIGHTS COUNCIL (INDIA)
मानवाधिकार परिषद (भारत)
Certificate for Appointment
We hereby present this Certificate to
MR. PASUPULA NAGA SUBBARAYUDU
This certificate verifies that person named above is an official volunteer appoint as
PRESIDENT, ANDHRA PRADESH
We expect your active voluntary contributions accepting all challenges while making her / himself a Role Model. We feel honoured in felicitating you for your remarkable contribution towards the betterment of the Society.
07-03-2026
Date of Issue
National President

మహానంది, పల్లె వెలుగు

సామాజికంగా, వ్యక్తిగతంగా పేద బడుగు బలహీన వర్గాల తరపున అవిశ్రాంతంగా పోరాటం చేసి వారి హక్కులను కాపాడటమే ధ్యేయంగా కృషి చేస్తానని మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఇండియా స్టేట్ ప్రెసిడెంట్ పీయన్ ఎస్.రాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాడ్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులయ్యారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు హ్యూమన్ రైట్స్ కౌన్సిలింగ్ ఇండియా నేషనల్ ప్రెసిడెంట్ ఆరతి రాజ్ పుత్ కు కృతజ్ఞతలు తెలిపారు.మానవ హక్కుల సంరక్షణలో ఎనలేని కృషిని సాధించి తమ సంస్థను రానున్న రోజుల్లో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. బాధితుల తరపున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వివిధ సంస్థలు, సమాజంలో ఏ రకమైన బాధితులు ఉన్నా, వారు తమ దృష్టికి సమస్యను







తెచ్చినట్లయితే వెంటనే తగు న్యాయపరమైన పోరాటం చేసి వారికి అండగా నిలుస్తామని మాట ఇచ్చారు.

# భాష్యం పాఠశాలలో కల్చరల్ డే-ముఖ్య అతిథులుగా పాల్గొన్న డిప్యూటీ డిఈఓ రాజేంద్రప్రసాద్







**ప్రముఖ పారిశ్రామిక వేత్త ఏసీ శ్రీకాంత్ రెడ్డి.**

**ఆదోని (పల్లె వెలుగు):**

భాష్యం చైర్మన్ రామకృష్ణ ఆదోని భాష్యం టు పాఠశాలలో జెడ్ ఈ వో అయినటువంటి మాచాని కవిత ఆధ్వంలో భాష్యం పాఠశాలలో ఘనంగా కల్చరల్ డే ప్రోగ్రాం నిర్మించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ డిఇఓ రాజేంద్రప్రసాద్, మరియు శ్రీకాంత్ రెడ్డి టిడిపి జనరల్ సెక్రెటరీ హాజరు కావడం జరిగింది. పూల మాల శాలువాలతో సన్మానం చేయడం జరిగింది. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మానసికంగా తిరంగా ఉండాలంటే శారీరకంగా స్థిరంగా ఉండాలని ఉన్నారు మరియు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు చదివే కాకుండా కల్చరల్ డే యాక్టివిటీస్ చేయడం వల్ల పిల్లలకు డాన్సస్ అండ్ కరాటే, యోగా, చురుగ్గా పాల్గొంటారు అని చెప్పడం జరిగింది భాష్యం ప్రిన్సిపల్ రవి ప్రకాష్ మాట్లాడుతూ 2024 25 సంవత్సరంలో భాష్యం విద్యార్థి అయినటువంటి నిహాంజలి పదవ తరగతిలో స్టేట్ టాపర్ గా 600 కు 600 మార్కులు సాధించడం గొప్ప విజయం పేరెంట్స్ యొక్క గొప్పతనం అండ్ టీచర్స్ ప్రోత్సహంతో స్టేట్ టాపర్గా నిలవడం జరిగింది అని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ కల్చరల్ డే ప్రోగ్రాం కి విచ్చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రవి ప్రకాష్ తో పాటు వైస్ ప్రిన్సిపల్ అంజి, హెచ్ఎం మహేశ్వరి, వినోద్ రాఘవేంద్ర, బలరాం. కేశవ మాస్టర్, డాన్స్ మాస్టర్ రాజ్ కుమార్ ఉపాధ్యాయుల బృందం పాల్గొనడం జరిగింది.

# పెళ్లి అనేది రెండు హృదయాల పవిత్ర బంధం





**స్థానిక సంస్థ ఎన్నికల్లో వైకాపా విజయ డంకా మోగించాలి. వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి**

**ఆదోని (పల్లె వెలుగు):**

ఆలూరు నియోజకవర్గంలోని పలు వైకాపా నాయకుల కుటుంబ సభ్యుల వివాహ కార్యక్రమాల్లో వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ పెళ్లి అనేది రెండు హృదయాల పవిత్ర బంధం అని నూతన వధూవరులు తమ దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో పిల్ల పాపలతో అష్టైశ్వర్యాలతో కళకళలాడుతూ వారి దాంపత్య జీవితం కొనసాగాలని పెళ్లి పందిరి సాక్షిగా ఆ దంపతులను ఆశీర్వదించి, స్థానిక వైకాపా నాయకులతో స్థానిక సంస్థ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయ దంక మోగించాలని స్థానిక నాయకులతో ప్రత్యేకంగా చర్చించారు, ప్రతి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీలు గాని సర్పంచులు గాని అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని స్థానిక నాయకులకు సలహాలు సూచనలు తెలియజేశారు, ఏది ఏమైనా తెర్నేకల్ సురేందర్ రెడ్డి నియోజకవర్గంలో పలు వివాహాలకు హాజరు కావడం, ఆలూరు నియోజకవర్గంలో ఎవరు ఆహ్వానించినా ఏ కార్యక్రమం ఉన్న ప్రత్యేకంగా స్థానిక నాయకులు ఆయన రాక కోసం ఎదురుచూడడం నియోజకవర్గంలో చర్చనీయంగా మారింది, ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు హోలిగేర కేశం వెంకటరెడ్డి, బొబ్బిలి ప్రభాకర్ రెడ్డి, రామిరెడ్డి, ఎల్లార్తి అశోక్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, హెబ్బటం శ్రీనివాసరెడ్డి, ఇంగళ దహల్ సర్పంచ్ వెంకటరెడ్డి, మనేకుర్తి ప్రసాద్ రెడ్డి, ప్రహల్లాద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ 5 లక్షల ప్రమాద బీమా మీ కుటుంబానికి భరోసా







**జిల్లా జనసేన పార్టీ పరిశీలకులు కిలారి వెంకట రోశయ్య**

**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 8 పల్లె వెలుగు**

ఆళ్లగడ్డ తాలూకా జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి సోదరులు ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రోజున స్థానిక జనసేన పార్టీ కార్యాలయం నందు ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య ముఖ్య అతిథిగా హాజరై, సభ్యత్వ నమోదు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంత పెద్ద కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన ఇరిగెల సోదరులకు కృతజ్ఞతలు. స్థానిక ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గెలుపులో ఇరిగెల సోదరుల పాత్ర ఎంతో కీలకం. మీ నిరంతర కృషి, క్షేత్రస్థాయి పోరాటం వల్లే ఎమ్మెల్యే విజయం సాధ్యమైందని ప్రస్తుతం సభ్యత్వ నమోదు ప్రక్రియ కొంత మందకొడిగా సాగుతోంది. అయితే, రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ మరింత ఉత్సాహంగా పనిచేయాలి. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు జనసైనికులు నడుం బిగించాలని భవిష్యత్తులో సభ్యత్వ నమోదు వేగాన్ని పెంచి లక్ష్యాలను చేరుకోవాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం ఇరిగెల రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ. కిలారి రోశయ్య సూచనలను శిరసావహిస్తామని ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి జనసేన సిద్ధాంతాలను తీసుకెళ్తామని, రాబోయే రోజుల్లో సభ్యత్వ నమోదును ఒక ఉద్యమంలా చేపట్టి విజయవంతం చేస్తామని గడువు తక్కువ ఉంది గనుక మరికొన్ని రోజులు సభ్యత్వ నమోదుకు అవకాశం ఇవ్వాలని సభాముఖంగా కిలారి రోశయ్యను ఇరిగెల కోరారు తమపై నమ్మకం ఉంచిన జిల్లా నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగెల సోదరులతో పాటు పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

# 113వ రోజు రిలే నిరాహార దీక్షలో మహిళా మణులు





**ఆదోని (పల్లె వెలుగు):**

ఆదోని జిల్లా కావాలని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దీక్షలో మహిళలు. ఆదోని జిల్లా కావాలని 113 వరోజు రిలే నిరాహార దీక్షలో కూర్చున్న మహిళలు. ప్రపంచ దేశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటూ మహిళల్ని ఎంతో చక్కగా కీర్తిస్తూ సమాజం వారిని స్వేచ్ఛ జీవితం జీవించకుండా పురుష సమాజం. అడ్డుకుంటున్నది భారతదేశంలో మహిళల, కార్మికుల శ్రమను దోపిడీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం తెచ్చినటువంటి చట్టం చాలా మోసపూరితమైనది వారి శ్రమను దోచుకోవడానికి తీసుకువచ్చినది. జీవో, అయితే మహిళలు,విద్య,ఉద్యోగ,రాజకీయ రంగాలలో వారికి కూడా సాధ్యమే అని ఆదోని జిల్లా సాధన ఉద్యమంలో వారు కూడా పాలుపంచుకుంటూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు దాదాపుగా రిలే దీక్షలో కూర్చోడానికి కూడా ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సాధన జేఏసీ నాయకులు, బండారి హనుమంతు, వైపి నాగరాజు, పి కోదండ, టి వీరేష్,ప్రకాష్ జైన్, దేవి శెట్టి పాల్గొని మహిళలు ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమం మహిళా నాయకురాలు సుజ్ఞానమ్మ, కళావతి, విజయలక్ష్మి, అంబేద్కర్ నగర్ జ్యోతి, జానకమ్మ, జయమ్మ, రూపవతి, దానమ్మ, లక్ష్మీదేవి, రత్నమ్మ, యశోదమ్మ, తరుణ్ దీక్షలో కూర్చొని జిల్లా ఉద్యమాన్ని బలోపేతం చేశారు. ఆదోని జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో.జరుగుతున్నటువంటి రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఆదోని జిల్లా సాధన జేఏసీ నాయకులు,గుమ్మల బాలస్వామి, పిఎస్ వీరేష్, గోవిందు, మల్లారెడ్డి, సుభాష్ చంద్రబోస్, గంగన్న, జగన్, రామలింగయ్య తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

# వివాహ వేడుకలలో వైయస్సార్ యువ నాయకులు- వై, ప్రదీప్ రెడ్డి





**మంత్రాలయం పల్లె వెలుగు మార్చి 8**

ఆదోని డివిజన్ లో ఎమ్మిగనూరు నందవరం వివిధ గ్రామాల్లో వివాహ వేడుకలలో వైయస్ఆర్పి యువ నాయకులు వై ,ప్రదీప్ రెడ్డి చిలకలడోన, ఇబ్రహీంపురం, మాధవరం, మాలపల్లి,జాలవడి,పెద్ద కడబూరు, ముచ్చుగిరి, ఆదోని, ములుగుందం గ్రామాల్లో జరిగినటువంటి వివాహ వేడుకలు మరియు రిసెప్షన్ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి









**ఎమ్మిగనూరు పల్లె వెలుగు మార్చి8**

ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి ఎమ్మిగనూరు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరాలదొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గొల్ల చెన్నప్ప సోదరుని కుమారుడి వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం కడివెళ్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కోలాయి దుబన్న అల్లుడు బోయ శివ వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, మండల అధ్యక్షులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా టంగుటూరి అభిషేక్ వెంకట సాయి శ్వేత వివాహం





**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 8 పల్లె వెలుగు**

ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారి టంగుటూరి వి ఎస్ఎన్ ప్రసాద్ రావు స్వరాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు అభిషేక్ , వధువు సాయి శ్వేత వివాహం అంగరంగ వైభవంగా ఘనంగా జరిగింది, శనివారం నాడు రాత్రి ప్రత్యేకమైన సంగీత విభారి మైమరిపించే వంటకాలతో అందరినీ మంత్రముగ్ధులు చేశాయి.ఆదివారం నాడు ఉదయం ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలో కనీ విని ఎరుగని జరిగిన వివాహానికి పట్టణానికి చెందిన ప్రముఖులే కాక బందు మిత్రాధులు శ్రేయోభిలాషులు తరలివచ్చి అభిషేక్ సాయి శ్వేత నూతన దంపతులను అక్షింతలతో ఆశీర్వదించారు. తరలివచ్చిన అతీతులందరినీ టంగుటూరి ప్రసాద్ సోదరుడు టంగుటూరి సత్యనారాయణ ఆహ్వానించారు .పెళ్లిలో గుమగుమలాడే నోరూరించే పసందైన అరుదైన వంటకాలతో వచ్చిన అతిథులందరూ ఆరగించారు, చందన తాంబూలాలతో స్వీకరించి సెలవు తీసుకున్నారు.

## మహిళా దినోత్సవం పేద మహిళకు సన్మానం



**అమ్మ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో మహిళలకు సన్మానం.**

**ఆదోని (పల్లె వెలుగు):**

ఈ రోజు మహిళా దినోత్సవం సందర్బంగా అమ్మ పాఠశాల ఆదోని యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు మహిళా రైతు ను వేదికపై ఆహ్వానించి. సన్మానించారు.అమ్మ పాఠశాల లో జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా పొలాల్లో పనిచేస్తున్న మహిళా రైతు ను సాధారంగా వేదికపై ఆహ్వానం పలికి దాదాపు 11 మంది మహిళా ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు శ్రీమతి ఎస్.కె బాను మరియు అమ్మ స్కూల్ స్థాపకులు ఎల్కే చిన్నప్ప లు కలిసి సన్మానించారు.ఈ సందర్భంగా మహిళా రైతు లక్ష్మి మాట్లాడుతు ఈ పాఠశాల వారు మహిళలకే కాక మా లాంటి రైతులను రైతు కూలీలను కూడా చాలా గౌరవం ఇస్తున్నారన్నారు.

## మహిళ విద్యా అభివృద్ధి ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యం

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బీసీ బాలికల హాస్టల్ లో సదస్సు.**





**ఆదోని (పల్లె వెలుగు):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం ను పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలో బీసీ హాస్టల్లో అమ్మాయిల విద్యాసమాజ అభివృద్ధి" అంశం పై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు కు ముఖ్య అతిధిగా శాషా నర్సింగ్ హోమ్ డాక్టర్ రేష్మ పాల్గొని ఉపన్యాసం ఇచ్చారు విద్యార్థినీలు చదువులో శ్రద్ధ పెడితే వారి కుటుంబం తో పాటు సమాజం అభివృద్ధి అవుతుంది అని అన్నారు,సోషల్ మీడియా లో అమ్మాయిలు జాగ్రత్త గా ఉండాలని, సైబర్ క్రైమ్ లో మోసపోవద్దు అని జాగ్రత్తలు తెలిపారు. విద్యార్థినీలు చదువు ఎంతో విలువైనది అని అలాంటి చదువును ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఉన్నత శిఖరం కు ఎదగాలని తెలిపారు హాస్టల్ వార్డెన్ పరిమిల, ఎస్ఎఫ్ఐజిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి శశిధర్ పాల్గొన్నారు.

# ఏపీ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం







**ఎమ్మిగనూరు పల్లె వెలుగు మార్చి 8**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భావం వెనుక శ్రామిక మహిళలు,సోషలిస్టు మహిళల పోరాటం వారి కృషి వెలకట్టలేనిదని గాఖ మండల మహిళా కన్వీనర్ గాయత్రి, ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి యు.ఈరమ్మ అన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు సిపిఐ కార్యాలయంలో ఏపీ మహిళా సమాఖ్య( ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు అనంతరం ఎస్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడివన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి జి రంగన్న,ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు వాణి, సహాయ కార్యదర్శి చాముండి,రేణుక మాట్లాడుతూ మహిళా దినోత్సవం కేవలం వేడుక కాదని శ్రమశక్తిలో మహిళల సమానత్వం కోసం జరిగిన ఒక గొప్ప రాజకీయ ఉద్యమం అన్నారు.మహిళా కార్మికులకు మెరుగైన వేతనాలు, సమానపనికి సమాన వేతనం,పని గంటల తగ్గింపు, ఓటు హక్కు,ప్రసూతి సెలవులు, లింగ వివక్షతకు వ్యతిరేకంగా సమానత్వం సాధన కోరుతూ శతాబ్ధానికి పైగా శ్రామిక, సోషలిస్టు మహిళలు చేసిన పోరాటాల ఫలితంగా మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భావం జరిగిందన్నారు. జర్మనీ కు చెందిన సోషలిస్టు ఉద్యమ నేత క్లారా జట్కిన్, రోసా లక్సెంబర్గ్ లాంటి కమ్యూనిస్ట్ మహిళలు అనేక అంతర్జాతీయ వేదికలపై మహిళలు అణచివేత,వివక్షత, శ్రమదోపిడీ, అధిక పనిగంటలపై తమ గళాలు విప్పి ఉద్యమించారన్నారు. వీరి పోరాటాలు ఫలితంగా ఐక్యరాజ్యసమితి 1975లో మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. మహిళా దినోత్సవానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ఘనత జర్మన్ సోషలిస్టు నాయకురాలు క్లారా జెట్కిన్ కు దక్కుతుందన్నారు.దేశంలో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సీపీఐ ఎంపీలు గీతా ముఖర్జీ, రేణుచక్రవర్తి లాంటి మహిళా నేతల సుదీర్ఘ పోరాటాల ఫలితమేనన్నారు. తొలుత మహిళా బిల్లు పార్లమెంట్ లో ప్రవేశ పెట్టి రాజ్యసభలో ఆమోదింప చేసిన ఘనత గీతాముఖర్జీ దే నన్నారు.మహిళలపై ఇంకా కొనసాగుతున్న దాడులు, అత్యాచారాలు,వివక్షతలకు వ్యతిరేకంగా సమానత్వ సాధన దిశగా మహిళలు సంఘటితంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు వెంకటలక్ష్మి,ఈరమ్మ,భాగ్యలక్ష్మి, షేకంబి, రాధా, కీర్తి, చిట్టెమ్మ,ఆశ, పార్వతి, ఫాతిమా, అరుణ, షహీన్, సరస్వతి,సావిత్రమ్మ, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

# గాజుల పల్లెలో భారత్ గెలుపుతో యువత సంబరాలు





**మహానంది,పల్లె వెలుగు**

ఐసీసీ టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్లో టీమ్ ఇండియా ఘన విజయం సాధించినందుకు మహానంది మండలం గాజులపల్లెలో యువత సంబరాలు అంబరాన్ని అంటాయి. ఆదివారం రాత్రి న్యూజిలాండ్ -భారత్ తలపడిన క్రికెట్ పోటీల్లో భారీ స్కోరును సాధిస్తూ విజయం దిశగా పరుగులు తీసింది. దీంతో భారత దేశ పౌరులు ముఖ్యంగా యువత టపాకాయలు పేలుస్తూ సంబరాలు చేస్తున్నారు. ఈ సంతోషం అంబరాన్ని అంటేలా సాగింది. అనంతరం జై భారత్ అంటూ నినాదాలు చేశారు.

# శ్రీవివేకవర్ధిని హైస్కూల్ లో అంతర్ముఖి, ఆనంద, ఆరోగ్య, యోగ శిబిరం





**కేసముద్రం, మార్చి 08(నంది పత్రిక):**

కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం అంతర్ముఖ ఆనంద ఆరోగ్య యోగ శిబిరం ఘనంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన శ్రీసత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ యోగా గురువు భిక్షమయ్య పాల్గొని యోగ సాధన యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ప్రతిరోజూ యోగ సాధన చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళనలు తగ్గి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడుతుందని చెప్పారు. యోగ మనిషిని అంతర్ముఖంగా మార్చి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. శ్రీవివేకవర్ధిని హైస్కూల్ కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత యోగ సాధనను అలవాటు చేసుకుంటే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. ఈ శిబిరాన్ని నిర్వహించడంలో సహకరించిన నిర్వాహకులు చింతనూరి సతీష్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు, యోగా ఆసక్తి గల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేశారు.

# ములుగులో నూతన శారదా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవం








## ముఖ్య అతిథిగా మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్

**ములుగు జిల్లా బ్యూరో మార్చి 8**

ములుగు జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన శారదా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ఆసుపత్రిని ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ పోరిక ప్రశాంత్ నాయక్ను అభినందిస్తూ వైద్య రంగంలో చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ, ములుగు జిల్లా గిరిజన ప్రాంతంగా ఉండటంతో ఇక్కడి ప్రజలకు సమయానికి నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా వాజేడు, వెంకటాపురం వంటి దూర ప్రాంతాల నుండి హన్మకొండ వరకు అత్యవసర వైద్య చికిత్స కోసం వెళ్లాల్సి వస్తోందని, మార్గమధ్యలో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం వల్ల కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా జరుగుతున్నట్లు తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ములుగు పట్టణంలో 24 గంటల అత్యవసర వైద్య సేవలతో శారదా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఖాసీందేవ్‌పేట్ గ్రామ సర్పంచ్ భూక్య నిరోషా అమర్ సింగ్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంత ప్రజలకు అత్యవసర సమయంలో సమీపంలోనే వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంతో ఉపయుక్తమని తెలిపారు. ఈ ఆసుపత్రి ద్వారా అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన చికిత్స అందించి అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా ములుగు జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఈ ఆసుపత్రి ప్రజల విశ్వాసాన్ని పొందాలని కోరారు. గ్రామీణ మరియు గిరిజన ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి యాజమాన్యం కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ పోరిక ప్రశాంత్ నాయక్ మాట్లాడుతూ, ములుగు మరియు పరిసర గిరిజన ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24 గంటల అత్యవసర వైద్య సేవలు, నిపుణులైన వైద్యులు, ఆధునిక వైద్య పరికరాలతో ప్రజలకు మెరుగైన చికిత్స అందించేందుకు ఆసుపత్రి సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వైద్యులు, సామాజిక కార్యకర్తలు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి చెందుతూ ములుగు జిల్లా ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని అతిథులు ఆకాంక్షించారు.

# ములుగు జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు










## మహిళా సాధికారతకు కాఫెడ్ సంస్థ ఘన ఆవిష్కరణలు

**ములుగు జిల్లాబ్యూరో , మార్చి 8:**

ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో ఆదివారం కాఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి సంస్థ డైరెక్టర్ బ్రదర్ లూర్దురాజ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమం ప్రారంభంలో సుమారు 500 మంది మహిళలతో భారీ ర్యాలీ ఏర్పాటు చేయబడింది, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా హక్కులపై సామాజిక చైతన్యం సృష్టించడానికి. ర్యాలీ స్థానిక తహశీల్దారు కార్యాలయం నుండి సమావేశ వేదిక వరకు నిర్వహించబడింది. ప్రధాన అతిథిగా హాజరైన ములుగు జిల్లా సంక్షేమ అధికారి ఇ. పి. ప్రేమలత మాట్లాడుతూ, "బాల్య వివాహ ముక్త్ భారత్" నినాదంతో 2030 నాటికి బాల్య వివాహాలు లేని భారత్ నిర్మాణంలో మనం భాగస్వాములం కావాలి. బాల్య వివాహాలను నిర్మూలించడం ద్వారా మహిళల హక్కులను కాపాడవచ్చని, మహిళలు కుటుంబం నుండి సమాజం వరకు ప్రతిభను చాటుతూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఆమె మహిళలకు విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన కల్పించడం సమాజ పురోగతికి ప్రధాన ఆధారం అని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన బ్రదర్ లూర్దురాజ్ మహిళా సాధికారతను సమాజ అభివృద్ధికి మూలస్థంభంగా పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల పెంపుదల కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమానికి వెంకటాపురం, వాజేడు మండలాల వివిధ గ్రామ పంచాయతీల మహిళా సర్పంచులు, మాజీ మండల మహిళా ప్రజా ప్రతినిధులు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ హరికృష్ణ బాల్య వివాహ నిషేధ చట్టం-2006 & ఫోక్స చట్టం-2012 వివరించారు. కాఫెడ్ సంస్థ గత రెండు నెలలుగా వెంకటాపురం & వాజేడు మండలాల యువతులకు కుట్టు మిషన్ శిక్షణ నిర్వహించింది. కార్యక్రమంలో శిక్షణ పొందిన యువతులకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేయడం జరిగింది. స్థానికంగా సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించడం జరిగింది. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ బి ఎల్ ఓ అవార్డు పొందిన కోర్స సమ్మక్కను ప్రత్యేకంగా సన్మానించారు. చివరగా, కెజిబివి వెంకటాపురం పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు ఆకర్షణీయంగా నిలిచిన ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది మహిళలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, సిడి పిఒ ముత్తమ్మ, సూపర్వైజర్ పుష్పలత, శ్యామల, టీచర్ బృందం, సుధాకర్ లారెన్స్, బ్రదర్ బాబు & సిబ్బంది, సిహెచ్ ఎల్ వర్కర్ చంటి మరియు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా హాజరయ్యారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళా సాధికారత, బాల్య వివాహాల నిరోధం, సామాజిక చైతన్యం మరియు గ్రామీణ మహిళల సామర్థ్య అభివృద్ధికి గణనీయమైన పురోగతి సాధించబడినట్లయింది.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వన్ స్టాప్ సెంటర్ ప్రారంభం

**బాధిత మహిళలకు తక్షణ సాయం అందించడమే లక్ష్యం.**

**ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్.**







**ఆదోని (పల్లె వెలుగు):**

ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళ దినోత్సవ సందర్భంగా 'వన్ స్టాప్ సెంటర్' ప్రారంభం. బాధిత మహిళలకు తక్షణ సాయం అందించడమే లక్ష్యం ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్. ఆదోని, మార్చి 08: మహిళల రక్షణ మరియు వారికి అవసరమైన తక్షణ సాయం అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వన్ స్టాప్ సెంటర్' (సఖి) ను ఆదోని ఏరియా ఆసుపత్రిలో ఆదివారం ఘనంగా ప్రారంభించరు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ విజయ.(పిడి), స్థానిక సి.డి.పి.ఓ. ధిల్లీ శ్వరి. (సిడిపిఓ) మరియు వైద్య అధికారి నాగరాజు.పాల్గొన్నారు. ఒకే చోట అన్ని సేవలు. ఈ సందర్భంగా, గృహహింస, వేధింపులు మరియు ఇతర ఆపదల్లో ఉన్న మహిళలకు వైద్యం, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ మరియు తాత్కాలిక వసతిని ఒకే చోట అందించడమే ఈ సెంటర్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఈ సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో.. త్వరితగతిన న్యాయం బాధిత మహిళలు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఇక్కడే పోలీసు సహాయం కూడా లభిస్తుంది. వైద్య సదుపాయం: ఆసుపత్రి ప్రాంగణంలోనే ఉండటం వల్ల అత్యవసర వైద్య సేవలు వెంటనే అందుతాయి.

# స్త్రీ ఎక్కడ పూజింపబడుతుందో అక్కడ దేవతలు కొలువై ఉంటారు

**టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు.**

**ఆదోని (పల్లె వెలుగు)**




నేటి మహిళ తన కుటుంబ బాధ్యతలతో పాటు విద్య, వైద్యం, విజ్ఞానం, రాజకీయాలు, వ్యాపారం వంటి అన్ని రంగాలలో ప్రతిభ చాటుతూ సమాజ పురోగతికి, దేశాభివృద్ధికి తన శక్తి సామర్థ్యాలను అంకితం చేస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సృష్టికి మూలమైన మహిళా మూర్తులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది, కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బలపడుతుంది. మహిళల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్.పి.వి. వ్యాక్సిన్‌లను వినియోగించుకొని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరుతున్నాను.

# మహిళలపై హింసను నివారించాలి

**ఐద్వ మండల కార్యదర్శి అల్పుగొండ సావిత్ర.**

**కేసముద్రం, మార్చి 08**




కేసముద్రం మండలం హరిహర గార్డెన్స్ లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వ మండల కార్యదర్శి అల్పుగొండ సావిత్ర మాట్లాడుతూ రోజురోజుకు మహిళలు గృహహింసకు, పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురవుతున్నారని, హత్యలు అత్యాచారాలు, దాడులకు గురవుతున్నట్లు జాతీయ నేర నిర్ధారణ గణాంకాలు చెబుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కొరకు ఉన్న చట్టాలను అమలు చేయాలని, మద్యం, మత్తు పదార్థాలు నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో తోట యాకమ్మ, నూకల కవిత, వాంకుడోత్ యమున, గుగులోతు మాలమ్మ, వాంకుడోత్ రమ తదితరులు పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com